
డిసెంబరు 2020
రు. 20/-

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక




# అమెరికా, యు కె లలో ప్రారంభమైన కోవిడ్ వ్యాక్సినేషన్



స్పై థ్రిల్లర్ నవలల ఆద్యుడు
జాన్ ల కారే (1931-2020)




కోవిడ్ వ్యాక్సిన్ తయారీ సంస్థ సీరమ్ ఇనిస్టిట్యూట్ ను
సందర్శించిన ప్రధాని



వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**

# చైతన్యం

సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -10   డిశంబరు 2020   సంచిక - 3

## ఈ సంచికలో....

| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 6 |
| ఓ రచయిత కథ | 7 |
| పూరీ జగన్నాధస్వామి వైభవం | 12 |
| వేదులాన్వయము పలుకు | 15 |
| సప్త మోక్ష నగరాలు | 16 |
| సినిమా | 19 |
| 116 కందాల్లో సుందరకాండ | 21 |
| కర్మ చండాలుని దోషములకు నిష్కృతి లేదు | 24 |
| గ్రీసు దేశపు పురాణ గాథలు | 27 |
| ప్రేమంటే ఇంతే | 32 |
| భయం | 36 |
| తెలుగు పద్య రత్నాలు-20 | 39 |
| నవవిధ భక్తులు | 41 |
| మా ఊరి నందుల కథ | 43 |
| కవి దేవరాజు-రచయిత మహారాజు | 47 |

రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

# ఆరోగ్యమే మహా భాగ్యం

## అస్తవ్యస్తంగా ప్రజల ఆరోగ్యం

ఏపీ లోని పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో అంతు బట్టని వ్యాధికి గురౌతున్నారు ప్రజ లు. వింత వ్యాధికి గల కారణాలను తేల్చేందుకు పంపుతున్న శాంపిల్స్ ను పరీక్షిస్తున్న డాక్టర్లు విస్తుబో-తున్నారు. అసలు ఇలాంటి పరిస్థితులలో జనం అక్కడ ఎలా బతుకుతున్నార ని వారు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా అంతా ఊహించినట్లుగానే కాలుష్యమే ఈ వింత వ్యాధికి కారణమని నిర్ధారణ అవుతుం-డగా ... ఇందులో క్రిమి సంహారకాల శాతం కొన్ని వేల రెట్లు అధికంగా ఉన్నట్లు తేలడం ఆశ్చర్యా-నికి గురిచేస్తోంది, వ్యవసాయం పేరుతో స్థానికంగా విచ్చలవిడిగా సాగుతున్న పురుగుల మందుల వాడకమే దీని వెనకున్నట్టు స్పష్టమవుతోంది. వీటివల్ల ప్రజలు ఫిట్స్ వచ్చి పడి పోవడం, అపస్మారకం అవడం లాంటివి జరుగుతున్నాయి . ప్రాణాలు కోల్పోవడం లేదు కానీ ఇలాంటి వాటితో ఏలూరులో చాలామంది ఇబ్బంది పడుతున్నారు.

## వింత వ్యాధి శాంపిల్స్ కూడా భయానకం

ఈ వింత వ్యాధిని వెలికి తీసేందుకు ఎయిమ్స్, డబ్ల్యూహెచ్ వో సీసీఎంబీ తీవ్రంగా శ్రమిస్తున్నా-యి. ముందుగా రోగుల శరీరాలనుంచి సేకరించిన శాంపిల్స్ పరీక్షించినప్పుడు అందులో సీసం నికెల్ ఉన్నట్లు గుర్తించారు. ఇప్పుడు నీటి నమూనాలను పరీక్షిస్తే మరిన్ని ఆశ్చర్యకర వాస్తవాలు బయటకి వచ్చాయి. నీరు ఎన్నడూ లేనంత దారుణంగా కలుషితమైందని, వైరస్ ఆనవాళ్లు లేకపోయినా, పురుగులమందు అవశేషాలు మాత్రం వేల రెట్లు అధికంగా ఉన్నాయని నిర్ధారణ ని నిర్ధారణ అవుతోంది. దీంతో డాక్టర్లు మరింత లోతుగా పరీక్షించేందుకు సిద్ధమవుతున్నారు.

## దారుణంగా కృష్ణ గోదావరి జలాలు

నీటి నమూనాల్లో మెధా క్లిక్లోర్ 17వేల 640 రెట్లు అధికంగా ఉందని డాక్టర్ల తేల్చారు. తాగునీటి-లో ఈ రసాయనం అసలు ఉండకూడదు. ఒక వేళ ఉన్నా 0.001 మిల్లీ గ్రాములకు మించకూడ-దు. కానీ తాజా శాంపిల్స్ పరీక్షలో ఇది 17. 64 మిల్లీ గ్రాములున్నట్లు తేలడం డాక్టర్లను సైతం కలవర పెడుతోంది. ఏలూరులో దాదాపు 6 ప్రాంతాల్లో నీటి నమూనాలను పరీక్షించగా అన్ని చోట్లా ఒకే ఫలితాలు రావడంతో, నగరానికి సరఫరా అవుతున్న కృష్ణా గోదావరీ జలాలు విషతుల్యం కావడం వల్లే రోగుల శరీరంలో సీసం, నికెల్ చేరినట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పుడు ప్రభుత్వాల నిర్లక్ష్యం, రైతుల విచ్చలవిడితనం బయటకి వస్తున్నాయి.

## పూర్తి స్థాయి విశ్లేషణ అనంతరం తుది నివేదిక

ఏలూరులో ఈ అంతు చిక్కని వ్యాధికి గల కారణాలను పూర్తి స్థాయి నివేదిక వచ్చాకే నగరం లో శాశ్వత చర్యలు చేపడతామని మంత్రి 'మంత్రి ఆళ్లనాని' తెలిపారు. ప్రస్తుతం ఏలూరులో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, వ్యాధికి గల కారణాలు జాతీయ సంస్థలు పరిశోధనలు సాగిస్తున్నాయని మంత్రి తెలిపారు. ఈ సంస్థలు తుది నివేదిక అందించిన అనంతరం వ్యాధికి కారణాలు వెల్లడిస్తా-మని, ప్రజలు భయాందోళనలకు గురి కావద్దని మంత్రి చెప్పారు.

# భారత్ లో జనవరిలో వ్యాక్సినేషన్

## వ్యాక్సిన్ వచ్చేస్తోంది----- ప్రజల్లో ఆనందం

దిన దిన గండం నూరేళ్లుగా ఉన్న జీవితాలతో, బయటకు రాలేక, నోటికీ గుడ్డ కట్టి, మూసుకుని కూర్చోలేక ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కరోనా వచ్చిన వారు బతికి బట్టకట్టే వరకూ అనుమానమే. కొందరి కుటుంబాలైతే కరోనా వ్యాధితో బాధలు పడిన వారు, మరి కొన్ని కుటుంబాలలో కొందరైతే వ్యాధి తీవ్రతను తట్టుకోలేక ప్రాణాలనే కోల్పో-యారు, కుటుంబాలు చెల్లాచెదురై పోయాయి. ఇంత క్లిష్టమైన వ్యాధికి మందు కనిపెట్టడానికి శాస్త్ర వేత్తలు రాత్రి పగలు శ్ర-మించారు. ఎలాగైతే నేమి మందు టీకా రూపంలో వచ్చేస్తోంది. అందరికీ అందుబాటులో ఉంచి, ప్రజలందరినీ ఆరోగ్యం-గా ఉంచాలని ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగా దేశ వ్యాప్తంగా కరోనా వ్యాక్సిన్ ల పంపిణీకి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. పోలింగ్ సెంటర్ల తరహాలోనే వ్యాక్సిన్ సెంటర్లు కూడా ఏర్పాటు చేసి, టీకాలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి అని కేంద్ర ఆరోగ్య శాఖ సూచించింది. వ్యాక్సిన్ స్టోరేజ్ పంపిణీకి సంబంధిం-చిన అన్ని వివరాలను వివ రిస్తూ, గైడ్ లైన్స్ జారీ చేసింది. తొలి దశలో కోటి మంది హెల్త్ వర్కర్లకు, ఆ తరువాత 2 కోట్ల మంది ఫ్రంట్ లైన్ వర్కర్ల (పోలీసులు మున్సిపల్ ఉద్యోగులు, ఆర్మీ హోంగార్డులు, జైళ్ల శాఖ సిబ్బంది డిజాస్టర్ మేనేజ్ మెంట్ కి మూడో రౌండ్ లో వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 50 ఏండ్ల వయసు దాటిన వారికి, 50 ఏండ్ల కంటే తక్కువ వయసు ఉండి ఇతర జబ్బులతో బాధపడుతున్న వారికీ వ్యాక్సిన్ ఇవ్వాలని కేంద్రం చెప్పింది. వీరు దేశ వ్యాప్తంగా 27 కోట్ల మంది ఉంటారని అంచనా వేసింది. పార్లమెంట్ లేదా అసంబ్లీ ఎన్నికల ఓటరు కార్డులోని వివరాల ఆధారంగా వారిని వయసుల వారీగా గుర్తించి, సాఫ్ట్ వేర్ లో సెల్ఫ్ రిజిస్ట్రేషన్ కు కూడా అవకాశం ఇవ్వనున్నట్లు వెల్లడించింది. అది కూడా రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆ సమయంలో ఏదైనా ఒక గుర్తింపు కార్డును వెబ్ సైట్ లో అప్ లోడ్ చేసుకున్న వారికి మాత్రమే వ్యాక్సిన్ ఇవ్వాలని కేంద్రం సూచించింది. అలాగే వ్యాక్సిన్ టీకా వేసుకుంటున్నప్పుడు ఏదైనా నెగిటివ్ రియాక్షన్ వస్తే వెంటనే కోవిడ్ వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయాలని, వాళ్ళకు ట్రీట్మెంట్ అందించేందుకు డాక్టర్లు, మెడికల్ టీములు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని వివరించింది. కొందరికి దురద లాంటి సమస్యలు రావచ్చు. అలా వస్తే ఎలా స్పందించాలి? ఏయే మందులు అందుబాటులో ఉంచుకోవాలి? అలాగే టీకా వేయించుకున్న వారు కనీసం అరగంటై-నా అక్కడే ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అధికారులకు జూమ్ లో శిక్షణ మొదలైంది. తరువాత డీ ఎంహెచ్ఓ లు, ఇతర ఉన్నతాధికారులకు శిక్షణ ఇస్తారు. టీకాల పంపిణీపై ఆరోగ్య కార్యకర్తలకు నేరుగా శిక్షణ ఇస్తారు. అమెరికా, ఇంగ్లాండ్ లలో డిసెంబర్ 14 వ తారీకున కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రారంభం అయింది.

**మనమంతా ఒక విషయం మరచిపోకూడదు. వ్యాక్సిన్ తీసుకున్నామని చెప్పి మనం అసలు అజా-గ్రత్తగా ఉండకూడదు. ఎందుకంటే వ్యాక్సిన్ వల్ల మన శరీరంలో 'యాంటీ బాడీస్' తయారవ-టానికి సమయం పడుతుంది. ఇప్పటివరకు పాటించినట్లే మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం మాత్రం మరవద్దు. ఈ విషయంలో భారత ప్రభుత్వ వైద్య మంత్రాలయం ఎప్పటికప్పు-డు చేసే సూచనలు పాటించాలి.**

**ఇకనుండైనా కోవిడ్ గురించిన భయం మరచిపోయి ప్రజలంతా ఆరోగ్య వంతులుగా ఉండాలని చైతన్యం సంకల్పబలం కోరుకుంటోంది.**

తీగవరపు శాంతి

# అభిప్రాయవేదిక

1. పత్రిక ఎప్పటికప్పుడు కొత్తదిగా అందంగా ఉంటుంది. ఎడిటో-రియల్ తో సహా అన్నీ లేటెస్టుగా చాలా బావుంటున్నాయి. ఎలెక్ట్రాన్ గారు వ్రాసినా 'ఆకాశంలో చిల్లులు' చాలా బావుంది. అప్సరసలు, నారదుడు అందరితో బావుంది. 'అహం ---- బ్రహ్మాస్మి' అంటూ ఎంతో అద్భుతమైన కథ వ్రాసారు భువన చంద్ర గారు . కథ ద్వారా మట్టి తో పోలుస్తూ గొప్పగా సూచనలు అందిచ్చారు.

రవి ప్రకాష్,శ్రీమతి ఇందిరా రాణి --- ఇబ్రహీంపట్నం, శ్రీమతి విజయ లక్ష్మి , శ్రీమతి మాధురి --- రాజోలు, శ్రీ కనకారావు, శ్రీ భద్రం, శ్రీమతి లత --- హైదరాబాదు.

2. పూరి జగన్నాథుడి గురించి డా. మురళీ కృష్ణ గారు చాలా బా-గావ్రాస్తున్నారు. విగ్రాహాలపై ఉన్న వస్త్రాలను తొలగించడం, ఆకా-శవాణి చెప్పిన విషయాలు అన్నీ కళ్ళకి కట్టినట్లుగా అందించారు. శ్రీమతి భారతిగారు అందిచ్చిన లక్ష్మీ కవచం ద్వారా అందరం చదువుకుని దేవీ కృపకు పాత్రులయ్యామనిపించింది.

శ్రీమతి సుజన, శ్రీమతి శ్రీదేవి, శ్రీ సత్యన్నారాయణ --- రాజోలు. శ్రీమతి కనక లత, శ్రీమతి పల్లవి, శ్రీ రవి --- ఏలూరు.

3. శ్రీమతి సరోజ గారికి కృతజ్ఞతలు. పత్రికలో మీ అందరి కృషి ఉంది. సినిమాల వివరాలు వ్రాస్తూ 'ఝుమ్మంది నాదం' అంటూ వ్రాసి పై. సుశీల, సునీత సంభాషణ అంటూ సస్పెన్స్ పెట్టారు. బాగా వ్రాస్తున్నారు. భక్తితో ముంచుతున్నాయి 'కొత్త రామానందం-గారు వ్రాస్తున్న సప్త మోక్ష నగరాలు. మధుర గురించి చాలా బాగా వ్రాశారు.

శ్రీ రమాకాంత్ , శ్రీమతి బేబి, శ్రీ వెంకటేష్, శ్రీమతి సుజన --- కర్నూలు. శ్రీ సునీల్ , శ్రీమతి లక్ష్మి, శ్రీమతి అపర్ణ ---- పూనా , శ్రీ రమేష్ , శ్రీ మధు, శ్రీమతి సుధ -- బొంబాయి.

4. 'పాలెపు బుచ్చిరాజు గారు' రాష్ట్ర పతుల గురించి ఎన్నెన్నో మంచి విషయాలు తెలియ జేశారు. అటువంటి వారి గురించి తెలుసు-కోవడం చాలా ఆనందంగా అనిపించింది. వేమూరి వెంకేశ్వరరావు గారు 'గ్రీసు దేశపు పురాణ గాథలు' చాలా బావుంటున్నాయి . మాకు తెలియని విషయాలు ఎన్నో తెలుస్తున్నాయి.

శ్రీమతి అనసూయ , శ్రేమతి చిట్టి పాప, శ్రీ భద్రం --- వి-జయవాడ. శ్రీమతి సుశీల, శ్రీ ఉమా మహేశ్వర రావు --- పిఠాపురం. శ్రీమతి అనుపమ --- ఏలూరు.

5. శ్రీమతి సుందరవల్లి శ్రీదేవి గారి కవిత బావుంది. 'ప్రేమంటే ఇంతే' సీరియల్ బాగా తీసుకు వస్తున్నారు. ప్రేమ అంటే ఒక్క ప్రేమికుల మధ్యే కాదు కుటుంబాల మధ్య కూడా ఎలా ఉండాలి అనే విషయాలు తెలియ-జేస్తూ...బావుంటోంది. 'పోడూరి శ్రీనివాసరావు గారు' భానుమతి గురించి వ్రాయడం నిజంగా ఎంత వ్రాసినా తక్కువే అన్నట్లు వ్రాసారు. అది నిజం కూడా .

శ్రీమతి పల్లవి, శ్రీమతి కమల, శ్రీ శ్రీనివాసరావు --- వెం-కటాపురం, శ్రీ నరసింహం , శ్రీ కనకారావు --శ్రీమతి పూర్ణిమ --కడప. శ్రీ శశి భూషణ్ --- సికిందరాబాదు.

6. చాగంటి కృష్ణ కుమారి గారు వ్రాస్తున్న 'గడి -- నుడి' చాలా ఉపయోగంగా అనిపిస్తున్నాయి. కానీ ఇంకా కొంత వరకే చెయ్యగలుగు తున్నాము.

తెలుగు పద్య రత్నాలు మీ పత్రికకు ఒక హైలైట్. మాలాంటి సాహిత్య పిపాస ఉన్నవాళ్ళకి ఈ శీర్షిక బాగా నచ్చుతోంది.

సుబ్రహ్మణ్య శర్మ, విజయవాడ

ఆదూరి హైమవతి గారి పట్టుదల పిల్లలకోసం వ్రాసిన ఒక మంచి కథ! రచయిత్రికి నమస్సులు.

రామబ్రహ్మం, సునీత కుక్కటపల్లి

గోరటి వెంకన్న గారి గురించి రామ్ మోహనరావు గారు చక్కగా వ్రాసారు.

అంజలి, లత, లీల, రామారావు, నల్లకుంట

# ఓ రచయిత కథ



## ఎలెక్ట్రాన్

పదవీ విరమణ చేసి పాతికేళ్ళయింది కాబట్టి ఏదో ఇంటిపట్టున ఉండి, ప్రతి ఉదయమూ నడవగలిగినంత దూరంలో ఉన్న రైతుబజారుకి వెళ్ళి ఒకటో రెండో కూరలు తీసుకురావడం, ఎప్పుడైనా కథలూ, కాకరకాయ కబుర్లూ రాసి, పోస్టాఫీసుకు నడిచివెళ్ళి పోస్ట్ చేసి తిరిగిరావడం ఒక అలవాటుగా మారి పోయింది. అందుచేత కరోనా గృహనిర్బంధం వల్ల పెద్దగా చికాకు కలగలేదు. మధ్య మధ్యలో డాబామీద లెక్కపెట్టుకొంటూ అటూ యిటూ ఓ వంద పచార్లు చేసి, పక్కనే ఉన్న వరండాలో వాలుకుర్చీలో కూలబడి, ఎనభై సంవత్సరాల పైచిలుకు జీవితంలో చేసిన తప్పిదాలను, తత్ఫలితమైన అనుభవాలను నెమరు వేసుకొంటూ కూర్చోడం ఒక అలవాటుగా మారిపోయింది. అయిపోయిన పెళ్ళికి చట్ట వాయిద్యాలెందుకన్న ఆలోచన రావడంతో ఆ పంథాకి స్వస్తి చెప్పేసి, వాట్సాప్ మహాశయుడికి స్వాగతం పలికేసరికి ఇక రోజంతా సందడే సందడి. మీకు ఎనభైలు దాటాయి కనక గుమ్మం కదలొద్దు, అని బంధుమిత్రులనుంచి సందేశాలే సందేశాలు. నేను అజ్ఞాతంగా కథలు రాస్తానన్న సంగతి తెలిసిన బహుకొద్దిమంది అభిమానులూ 'ఏం రాశారు, ఏ పత్రికల్లో పడ్డాయి, ఇంకా రాస్తున్నారా' అని నాలోని రచయితకి కుశల ప్రశ్నలు కొల్లలు. మహనీయుల వాక్యాలతో కూడిన శుభోదయం సందేశాలకి ఇక లెక్కలేదు.

ఇలా ఉండగా మా యింటికి అవతలి వీధిలో ఉండే రఘురామ్ అనే ఓ పాతికేళ్ళ యువకుడు ఒక సాయంత్రం బయటనుంచే ఉన్న డాబా మెట్లెక్కి, ముందస్తుగా కాస్త దూరంలో నిలబడి, "నమస్కారం గురువు గారూ!" అన్నాడు, చెవినుంచి చెవిదాకా సాగదీయబడి ముక్కునీ నోరునీ మూసేసిన నీలిరంగు అడ్డగోచీలోంచి.

"రఘూ! పర్వాలేదులే, వచ్చికూర్చో. గుండులా ఉన్నాను. మన కాలనీలో ఎవరికీ కరోనా రాలేదని అందరూ అనుకొంటున్నారు. ఉంటే ఈ పాటికి తెలిసిపోయే ఉండేది. దినపత్రిక చదవడానికి ముందు సానిటైజర్తో చేతులు రుద్దుకోవాలని మాత్రం ఓ కఠినమైన నియమం పెట్టేశారు కుటుంబ సభ్యులందరూ కలిసి. రెండు వస్త్రకవచాలు లోపల ఉన్నాయి. భయంగా ఉంటే కట్టుకొని వస్తాను," అన్నాను లేవబోతూ.

రఘురాం అవసరం లేదని తల అడ్డంగా ఊపడంతో ఆ ప్రయత్నం విరమించుకొన్నాను.

"నేనూ ఇంటి వద్దనుంచే పనిచేస్తున్నాను సర్! అందుచేత నా గురించి మీరూ అపోహలేమీ పడవద్దు," అంటూ పార్శ్వికమైన అడ్డముసుగుని తీసి జేబులో కుక్కుకొన్నాడు. ఎదురుగా ఉన్న కుర్చీని పక్కకు లాగి కూర్చున్నాడు.

"మాటల తుంపర్లు ఎదుటివారి మొహాలమీద పడకుండా కుర్చీని పక్కకి లాగి కూర్చున్నావ్! మంచిది. దీన్ని వాట్సాప్ లో పెట్టు!" అన్నాను నవ్వుతూ.

"సర్! ఆఫీసన్న తర్వాత నలుగురి మధ్యా కూర్చుని పనిచేస్తేనే ఉత్సాహంగా ఉంటుంది. ఒంటరిగా కూర్చుని టీవీలో బాహుబలి సినిమా మజా లేకుండా చూసినట్టుగా ఇంటినుంచి ఆఫీసు పని ఉంటోంది. శనాదివారాలు సెలవు. నాకు మిమ్మల్ని చూసి కథలు రాయాలనిపిస్తోంది. ఏవైనా సులువులు చెప్పండి సర్!" అన్నాడు.

"అదేమిటి రఘూ? నేనేమంత గొప్ప రచయితను కాను. మీ వీధిలోనే చక్రపాణిగారున్నారు కదా? ఆయన దగ్గరకు వెళ్ల లేక-

పోయావా?"

"అదీ అయింది సార్! ఆయన రాసిన పుస్తకాలు ఓ పది తీసుకొచ్చి, నా ముందుంచాడు. 'సర్! అలాగే చదువుతాను కానీ, మీ రెంతో ఖర్చుతో ఈ పుస్తకాలు అచ్చేయించుకొన్నారు కదా? ఊరికే తీసుకోను!' అంటూ పది పుస్తకాల ధర ఒక్కొక్కటీ 150 చొప్పున మొత్తం 1500/- ఆయన ముందుంచాను. ఆయన ఒక వంద తిరిగి ఇస్తూ 'మా వీధి అబ్బాయివి కాబట్టి,' అన్నాడు. ఆ తర్వాత నేను పుస్తకాల్నిపేజీలు తిప్పి చూస్తూ ఉండగా ఓ నిముషం ఆగి అన్నాడు. 'వీటన్నిటినీ శ్రద్ధగా చదువు. ఈ పుస్తకాల్లో నా పాతికేళ్ళ అనుభవం ఉంది. కలం చేబట్టిన నాటినుంచీ నేటివరకూ కథా రచయితగా అంచెలంచెలుగా నేనెలా పరిణితి చెందానో గమనించు. కథ రాయడమెలానో తెలిసిపోతుంది!' అన్నారు సార్!"

"మరింకనేం? చదివావా?"

"ఒక్కొక్క పుస్తకం నుంచి రెండేసి కథలు తీసి చదివాను సార్! ఆయన్ని గురించి చేదుగా చెప్పడం భావ్యం కాదు కానీ, కథలన్నీ ఏమిటో అస్పష్టంగా ఉన్నాయి. ప్రతివాక్యమూ ఒకటికి రెండు సార్లు చదివితేనేకాని అర్థమై చావటల్లేదు. అసలేం చెప్పదలచుకొన్నాడో ఆయనకే తెలియదేమో అనిపిస్తోంది! ఆయన చెప్పిన పరిణితి నాకు గోచరించలేదు."

"వెళ్ళి కలుసుకోలేకపోయావా?"

"కలుసుకొని ఏం చెప్పమంటారు? అర్థం కావటంలేదంటే, 'ఇంక నువ్వేం రాస్తావు, నామొహం?!' అని అంటాడేమోనని భయం. నేను ఇరుకులో పడడం తప్ప ప్రయోజనముండదు! నాకు కథ రాయాలన్న కోరిక బలీయంగా ఉన్నా, ఇతివృత్తం ఎంపిక తెలియటల్లేదు! జీవితాల్లోంచే కథలు పుట్టుకొస్తాయని చాలామంది చెబ్తూనే ఉంటారు కదా? మా నాయనమ్మ మా అమ్మని కాపురానికొచ్చిన కొత్తలో కోడంత్రికం పెట్టిందన్న మా అమ్మమ్మ మాటలు విని ఓ కథ రాశాను. ఏవో తెల్లకాయితాల అవసరం వచ్చి మానాన్న నాపుస్తకాల గూడు తెరిచి చూసినప్పుడు అది కంటబడి, ఇంట్లో ఏమి అనక పార్కుకేసి ఏదో పనుందని తీసుకు వెళ్ళి, అక్కడ మొహం వాచేటట్లు చీవాట్లు వేశాడు. తన లాగుజేబులో ఉన్న కథల కాయితాలు తీసి, పర్రున చింపేసి దగ్గరున్న కుందేలుబొమ్మ చెత్తడబ్బాలో పడేశాడు."

"అటు తర్వాత?"

"సాహితీ సమావేశాలకి వెళ్లేవాణ్ణి. కథలమీద చర్చ వచ్చినప్పుడు చాలామంది వక్తలు 'రచయితగా కలం పట్టేముందు కథాప్రక్రియ తెలుసుకోవడం చాలా ముఖ్యం. అందుకని మీరు విస్తృతంగా కథాసంపుటులు, కథాసంకలనాలు చదవాలి. పత్రికలు చదవాలి. గురజాడ అప్పారావు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, బుచ్చిబాబు, చలం, మధురాంతకం రాజారాం, అవసరాల రామకృష్ణారావు, అంపశయ్య నవీన్, రామా చంద్రమౌళి, ఇచ్ఛాపురపు జగన్నాథరావు, వసుంధర, వాణిశ్రీ, యెండమూరి వీరేంద్రనాథ్, పసలపూడి వంశీ ఇత్యాది ఎందరో మహా రచయితల కథలని చదివి రంగంలోకి దూకండి,' అని సలహాలు గుప్పించేసేవారు!"

"మరి చదివావా?"

"ఎలా సాధ్యమౌతుంది సార్? విద్యార్థిగా ఉన్నంతకాలం పరీక్షలమీదే ధ్యాస! 'కాలేజీ వార్షిక సంచికలో ఏదో కథా, వ్యాసమూ పడింది కదాని పత్రికల వెనక పరుగులు తీస్తూ, కథలు రాస్తూ కూర్చుంటే చదువులు కాస్తా అటకలెక్కేస్తాయి!' అని మా ఆంగ్లోపన్యాసకుడు రామానుజం గారు నాకు క్లాసులోనే అందరి ఎదుటా ఎండుగడ్డి పెట్టేశారు! దాంతో తలవంపులై, మా కాలేజీ లైబ్రరీలో కథల పుస్తకాలు ఎన్నో-ఉన్నా ఒక్కటీ చదవలేకపోయాను."

"మరిప్పుడు?" నవ్వుతూ ప్రశ్నించాను.

"కథరాయాలన్న కోరిక చంపేస్తోంది సార్! వీళ్ళందరిపుస్తకాలూ చదివిన తర్వాత కథాస్వరూపాన్ని అర్థం చేసుకొని, కలం చేపట్టేసరికి వానప్రస్థంలోకి వెళ్లాల్సిన వయసొచ్చేస్తుంది సర్!"

"చూడు రఘురామ్, ఒక విధంగా నువ్వు ప్రఖ్యాత రచయితల కథల పుస్తకాలు చదవకపోవడమే మేలయింది. లేకపోతే రెండు ఉపద్రవాలు జరిగేవి. 'వీళ్లలా నేను రాయలేను కనక ప్రయాస పడడం దండగ' అని రాయాలన్న నీ కోరికకు ఉద్వాసన చెప్పేస్తావ్! లేదా ఏ ఒక్క రచయిత శైలినో వంటబట్టించుకొని అనుకరణ మార్గంలో వెళ్లిపోతావ్! ఇదీ మంచిది కాదు. పద్యానికి మల్లే కథలు రాయడానికి ఛందస్సు అనేది అవసరం లేదు. కథ రాయడానికి ఏ నియమమూ లేదు. కేవలం అక్షరదోషాలు లేకుండా, నీకు నచ్చిన విషయంపై, నీకు వచ్చిన రీతిలో, నీకున్న పదపరిజ్ఞానంతో నిర్భయంగా రాసిపారేయి. ఒకవేళ వాక్యనిర్మాణంలో కొత్తపదాలు వాడాలంటే ఆచార్య జి.ఎన్. రెడ్డిగారి పర్యాయపదాల నిఘంటువు దగ్గరుంచుకో. వాక్యప్రవాహంలో కలిసే పదాల్ని ఎంచుకో. రాసిన దాన్ని ఒకటికి పదిసార్లు చదివితే చేసిన తప్పులు తెలిసొస్తాయి. అందుకని వాటిని సరిచేస్తూ సమయ, సందర్భ దోషాలు లేకుండా చివరి ప్రతి రాసి పత్రికలకి పంపించు. కొల్లలుగా రచనలు చేస్తూ, నీదీ అన్న ఒక నిర్ధారణమైన కథాశైలిని రూపొందించుకొన్నతర్వాతనే, ఇతరుల పుస్తకాలని విస్తృతంగా చదువు. లోకోభిన్నః రుచి అనే సత్యం తెలియవస్తుంది. వారి భావజాలం నిన్ను సులువుగా ప్రభావితం చేయలేదు. భావాన్ని అక్షర రూపంలో వ్యక్తం చెయ్యడానికి నీదీ అన్న ఓ శైలి వారికి భిన్నంగా నిలబడుతుంది."

"మీరు చెప్పింది బావుంది సార్! ధైర్యం చేస్తాను. కానీ ఇతివృత్తం విషయంలోనే చాలా సందిగ్ధతగా ఉంది. ఏ విషయం చేబట్టాలో తెలియటల్లేదు!

"పాతికేళ్ళ వయసులో బాల్యం-నుంచీ నేటివరకూ ఎన్నో అనుభవాలు ఉండి తీరాలే?ఇందాకా మీ అమ్మగారిపై మీ నాయనమ్మ అత్తగారిపెత్తనం గురించి చెప్పావు కదా? అలాగే .......?"

"ఉన్నాయి సార్! వాటికి రూపం ఇవ్వలేక పోతున్నాను. అయిదో తరగతి చదువుతోన్నప్పుడు ఆరో తరగతి చదువుతున్న ఓ అమ్మాయి ముద్దుపెట్టుకొంది. 'ఎందుక'న్నాను? 'నువ్వు సినిమాలు చూడవా' అంది. పదోతరగతిలో నేను చేయని తప్పుకు ఓ తెలుగు మాస్టారు నన్ను క్లాసులోంచి బయటకి పొమ్మని అరిచారు. బయటికొచ్చి తలని గొడకేసి బాదుకొన్నాను. నా మేనమామలిద్దరు ఆస్తి తగాదాల్లో గొంతుకలు చీల్చుకొని అరిచి, కొట్టుకున్నంత పని చేసి కోర్టుకెళ్లారు. వాళ్లకిప్పుడు మాటల్లేవు. వాళ్ళిద్దరూ విడివిడిగా మా అమ్మమీద తమ కూతుర్నికోడలుగా చేసుకోవలసిందని ఒత్తిడి తీసుకు వస్తున్నారు. మా నాన్న కనీసం రెండెకరాల స్థిరాస్తిని మొదటి పాటగా పెట్టి మేనమామలిద్దరికీ వేలపుజాలం వేశాడు. నా కైతే అసలు మేనరికమంటే ఇష్టం లేదు. మా బాబాయి బావమరిది ఒక మూడు నక్షత్రాల హోటలు మీద జరిగిన పోలీసుల దాడిలో ఒక ఎర్ర చిలకతో పట్టుబడ్డాడు. పిన్నమ్మ తన తమ్ముణ్ణి పోలీసులకు లంచమిచ్చి విడిపించుకోవడంకోసం మా బాబాయిని నసపెట్టి నలభైవేలు రాబట్టింది. మా నాన్న బాబాయిని తీవ్రంగా మందలించాడు. ఆ కోపంతో మా పిన్నమ్మ మా అమ్మ మీద కోపం పెంచుకొంది. ఇలా ఎన్నో ఉన్నాయి సార్! కానీ కథలెలా రాసేది?"

"రఘురామ్! నీ కథావస్తువులు చాలా బలంగా ఉన్నాయి. అయితే నువ్వన్నట్టుగా ఈ కుటుంబ గాథల్నిఇతివృత్తాలుగా తీసుకొని కథల్ని, నవలల్నీ ఆవిష్కరించడం కొంచెం క్లిష్టమే అయినా అసాధ్యం మట్టుకు కాదు. అయితే కుటుంబ కలహాలు చెలరేగుతాయి. అందుకని జీవితాల్లోంచే కథలు పుట్టుకొస్తాయన్న కథాసూత్రాన్ని నువ్వు అమలుపర్చదలుచుకొంటే మట్టుకు ......."

ఆపుచేశాను.

"ఏం చెయ్యమంటారు సార్?" రఘురామ్ ఆతృతగా అడిగాడు.

"అసలు పేరు అచ్చులో చూసుకొని మురిసిపోవాలన్న కీర్తి కాంక్షమీద మూత పెట్టు. నీ జన్మనక్షత్రం తప్పించి ఏదైనా కలంపేరు పెట్టుకో. నీకు తెలిసిన బంధు మిత్రుల వర్గాలలోని ఏ

ఒక్కరి పేరూ నీ కథల్లోని పాత్రల నెత్తిన రుద్దకు. కథాస్థలం తూ.గో జిల్లాలోని గోదావరి దగ్గరి రావులపాలెం అయితే, శ్రీకాకుళం జిల్లాలోని వంశధార దగ్గరి హీరమండలం అని రాయి. నువ్వు ఈ ఊళ్లోనే ఉంటే ఆఫీసు చిరునామా పత్రికల వాళ్లకివ్వు. పోస్టుమేన్ కి పండగ మామూళ్ళు దండిగా ఇవ్వు. కథ తిరిగి వచ్చినా, పారితోషకం కవరు వచ్చినా, అభినందన పత్రిక వచ్చినా కేవలం నీకే ఇచ్చేటట్లు ఏర్పాటు చేసుకో. ఇంకో మార్గ మేమిటంటే ఊరు బదిలీ చేయించుకొని విశాఖపట్నం వెళ్లిపో. ఎక్కడున్నా సాహితీ సమావేశాలకి వెళ్లకాని, ఎంత పురుగు దొలిచినా నువ్వెవరివో ఎవరికీ తెలియనీయకు. కథకు బహుమతి వచ్చిందనుకో నీ ఫోటో పంపకు. నీ వివరాలు పాఠకులకు తెలియకుండా ఉంచమని సంపాదకులకు విన్నవించుకో. తర్వాత్తర్వాత నీ పేరు నెమ్మదిగా తెలిసినప్పుడు పాఠకుల్లో ఆరాధనా భావం తలెత్తుతుంది."

శ్రీమతి తెచ్చిన కాఫీ తాగి, ఉత్తరాదివాళ్లలా వంగి ఒంటిచేత్తో నా పాదమంటి రఘురామ్ వెళ్లిపోయాడు. ఆ పై ఆదివారం ఉదయం ఫోన్ చేసి, ఒక రబ్బరు బ్యాండ్ తో చుట్ట చుట్టిన కాయితాలతో వచ్చి, ఏకహస్త పాదాభివందనం చేసి కూర్చున్నాడు. కబుర్లలో పడితే లోకం మరిచిపోతానని శ్రీమతి రెండు ఉప్మా ప్లేట్లతో వచ్చి ఇద్దరికీ తలోకటీ ఇచ్చి లోపలికి పోయింది. నా చిన్న మనవరాలు రెండుగ్లాసులతో నీళ్ళు తెచ్చి ఇచ్చి వెళ్లిపోయింది. తర్వాత కాఫీ వచ్చేసింది. ఉదయపు ఆతిథ్యం అయిన తర్వాత రఘురాం అన్నాడు. "సర్! మీరు చెప్పినట్టుగానే కథ రాశాను. చదివి మార్పులూ, చేర్పులూ ఏమైనా ఉంటే సలహా ఇవ్వండి," అని కథని అందివ్వబోయాడు.

"నేను నీ కథని చదవదల్చుకోలేదు. నువ్వు రాసిన కథని పత్రికలవాళ్లనే చదవనివ్వు. నువ్వు బలవంతం చేసి నా చేత చదివించావనుకో. ఎలా ఉన్నా, 'చాలా బావుంది!' అని భుజం తట్టడం ఒక పంథా. నా మీద గౌరవం కొద్దీ కథని చదివి అభిప్రాయం చెప్పమన్నావు కాబట్టి, చదివి, కథ ఎంత బావున్నా కొన్ని మార్పుల్నిసూచించడం రెండో పంథా. నీలో ఉత్సాహమూ కలగొచ్చు, నీరసమూ కలగొచ్చు. చివరికి నిర్ణయం తీసుకొనేది సంపాదకుడిది. అందుకని నువ్వు నిశ్చింతగా పత్రిక్కి పంపు. అన్నట్టు ముగ్గులోమాణిక్యం అనే మాసపత్రిక కథలపోటీ పెట్టింది. దానికి పంపు. వడబోతల్లో తప్పక చదవాల్సిన అగత్యం పత్రికలవాళ్లకుంటుంది. మామూలుగా పంపితే నెలల తరబడీ ఏ సమాచారమూ అందదు. పోటీకైతే వారు బహుమతి పొందిన కథలతో బాటు సాధారణ ప్రచురణల జాబితా కూడా ఇస్తారు కాబట్టి కథ సంగతి ఏమైందీ తేలిపోతుంది. బహుమతి వచ్చినా, లేక సాధారణ ప్రచురణకి నోచుకొన్నా ప్రథమ విజయం. లేదా తిరస్కరించబడితే కథ తీసుకొని రా! మనిద్దరం కలిసి విశ్లేషిద్దాం! అప్పుడు మార్పులూ, చేర్పులూ అవసరమైతేనే చేసి, మరో పత్రిక్కి హామీ పత్రంతో సహా పంపే అవకాశముంటుంది," అన్నాను.

మధ్యలో రఘురామ్ రెండు మూడు సార్లు వచ్చాడు. 'మళ్ళా ఏమైనా రాశావా?' అని అడిగితే లేదన్నాడు. 'ఈ కథ సంగతి తేలితేనే మరో కథకి కంప్యూటర్ ముందు కూర్చునేది!' అన్నాడు. ఏవో వాళ్ల ఆఫీసు కబుర్లూ అవీ చెప్పి, వాళ్ల అధికారి వ్యవహార శైలిని గురించి కథ రాసే ప్రయత్నం చేస్తానన్నాడు.

ఒక శుక్రవారం ఉదయం ఎనిమిదింటి కల్లా రఘురామ్ ఉరుకులు పరుగుల మీద వచ్చాడు. మొహం మీద ఆనంద తరంగాలు తాండవమాడుతున్నాయి. ఏమిటి సంగతి అన్నట్టుగా చూశాను. "సర్! ఇవ్వాళ ఉదయం ఆరింటికి ఎవరో కుమారస్వామి అనే అతను ఫోన్ చేశాడు. న్యాయ నిర్ణేతలు పది కథల్ని అంతిమ వడబోతలో నిలబెట్టారట. అందులో నా కథకూడా ఒకటని చెప్పాడు. రేపు సంపాదకుడూ, న్యాయనిర్ణేతలూ కూర్చుని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల్నీ, ఆరు ప్రత్యేక బహుమతుల్నీ నిర్ధారిస్తారట. అయితే ఏవో శాతాలు అర్పించుకొంటే మొదటి




మూడు బహుమతిల్లోనూ ఏదో ఒకటి మనమిచ్చే శాతాన్ని బట్టి పొందే అవకాశముందన్నాడు. సాయంకాలం లోపుగా ఏ కబురూ చెప్పమంటూ ఫోన్ నెంబరిచ్చాడు. ఏం చెయ్యాలో తోచక మీ దగ్గరకు వచ్చాను సార్!"

నాకేం సమాధానం చెప్పాలో తెలియలేదు. "రఘురామ్! నా వద్దకు రాకుండా నిర్ణయం నువ్వే తీసుకొనుంటే బావుండేది. ఇప్పుడు నేను ఏమని చెప్పగలను?"

"ఆఖరి వడబోతవరకూ నా కథ నిలవడం ఆనందంగా ఉన్నా, ఈ శాతాల వ్యవహారం సతాయిస్తోంది సర్! అందుకనే మీ దగ్గరికి వచ్చాను."

"నీ నిర్ణయమేమిటో చెప్పు మరి," అన్నాను.

"నేను సమాధానం యివ్వదలుచుకోలేదు!" అన్నాడు రఘురామ్

"బహుశా కుమారస్వామి న్యాయనిర్ణేతల్లో ఒకరు కావొచ్చు. ముగ్గులోమాణిక్యం సంపాదకుడి నెంబరుకి ఫోన్ చేసి ఈ వ్యవహారాన్ని గురించి చెబ్దాం! నీ మొబైల్లో సంపాదకుడి నెంబర్ రింగ్ చేసి నాకివ్వు. నేను నువ్వన్నట్టుగా మాట్లాడతాను. సరేనా?" అన్నాను.


రఘురామ్ సరేనని తల ఊపుతూ నెంబరు రింగ్ చేసి, లౌడ్ స్పీకర్ ఆన్ చేసి నాకిచ్చాడు. త్వరలోనే సమాధానం వచ్చింది. "ముగ్గులోమాణిక్యం సంపాదకుడితో మాట్లాడాలి," అన్నాను. "నేనే! చెప్పండి," అన్నాడు. గొంతు చాలా సౌమ్యంగా ఉంది. మర్యాదగా ఉంది.

"సర్! నా పేరు రఘురామ్. ఒక యువ రచయితను. మీరు పెట్టిన కథలపోటీలో నా కథ మొదటి పదికథల్లో నిలిచిందనీ, నేనిచ్చే శాతాన్ని బట్టి బహుమతుల నిర్ణయం జరుగుతుందని ఎవరో కుమారస్వామి గారని ఫోన్ చేశారు. ఇది మీ దృష్టికి తీసుకువద్దామని ఫోన్ చేశాను. సర్! ఇది ఏమంత న్యాయం? బహుశా మీకు తెలియకుండా ఆయన ఇలాంటి వ్యవహారం జరుపుతున్నారేమో?" అన్నాను.

"మీరెవరో నాకు తెలియదు. ఆ కుమారస్వామి ఎవరో కాదు. నా కుమార రత్నమే! ఈ పోటీ బలవంతంగా పెట్టించింది వాడే! నేను పేరుకే సంపాదకుణ్ణి కానీ వ్యవహర్త వాడే! నేను నిస్సహాయుణ్ణి. క్షమించండి!" అని ఫోన్ కట్ చేసేశాడు.

వారం తర్వాత ఫలితాలతో పత్రిక విడుదలైంది. మొత్తం ఎంపికైన కథల జాబితాలో ఎక్కడా రఘురామ్ కథ లేదు!

****



# పూరి జగన్నాధ స్వామి వైభవం

## డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

పూరి జగన్నాథుని రథయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైనది.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాథ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.
స్కాందపురాణాంతర్గతమైన జగన్నాథ క్షేత్ర మాహాత్మ్యాన్ని యథామూలంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

- సంపాదకురాలు

21 వ అధ్యాయం

జైమిని - ఋషి సంవాదం

( నారదుడు బ్రహ్మలోకానికి తిరిగి వెళ్ళుట)

ఋగ్వేద పండితుడైన ఒక పండితుడు రాజు దగ్గరకు వచ్చి, " రాజా! నీవు చాల అదృష్టవంతుడవు. నీకోసం స్వామి ఇక్కడ అవతరించాడు. ఈ మూర్తిని ఆరాధించినచో ముక్తి సులభంగా లభిస్తుంది. దారు రూపంలో ఉన్న ఈ స్వామిని వేదాలు అంగీకరించాయి. బారత దేశంలో ఓఢ్రదేశం(ఒరిస్సా) ఉత్తమమైనది. ఇక్కడ ఉన్నవారు స్వామిని ప్రత్యక్షంగా చూడగలుగుతున్నారు. వేదాలలోను, స్మృతులలోను చెప్పిన మార్గంలో స్వామిని చేరడం కష్టం. ఇక్కడ ఉన్న స్వామిని అర్చించినచో ముక్తిని సులభంగా పొందవచ్చు. దర్శించినంత మాత్రాన వేయి అశ్వమేధయాగాలు చేసిన ఫలితం లభిస్తుంది. భక్తితో అర్చిస్తే బ్రహ్మసాయుజ్యాన్ని పొందుతాడు. దుఃఖాలు నశిస్తాయి. ఈ క్షేత్రంలో స్వామి మనకు అత్యంత సన్నిహితంగా ఉంటాడు. రాజా! నీవు ఇక్కడే నివాసం ఉండు. స్వామినిఅర్చిస్తూఉండు" అని బోధించాడు. (1 - 28) )

బ్రాహ్మణుని మాటలకు నారదుడు ఆనందించాడు. "వేదాలలోను, ఉపనిషత్తులలోను చెప్పినదే ఇతడు చెప్పాడు. ఇది బ్రహ్మకు కూడా సమ్మతమైనదే. బ్రహ్మ ఆజ్ఞాపించినట్లుగా అంతా జరిగింది. నీవు ఇక్కడేఉండి స్వామిని అర్చించు. నేను బ్రహ్మదగ్గరకు వెళ్ళి జరిగినది అంతా చెబుతాను. నీ సంపదతో ఇక్కడ ఒక మందిరాన్ని నిర్మించి నరసింహస్వామిని ప్రతిష్ఠించు" అని నారదుడు చెప్పగా "మహర్షి! నేనుకూడా బ్రహ్మ



దగ్గరకు వస్తాను. స్వామి ప్రతిష్ఠకు అయన్ని ఆహ్వానిస్తాను" అని ఇంద్రద్యుమ్నుడు ప్రార్థించాడు.

" ఓ రాజ! మందిర నిర్మాణం పూర్తి అయ్యేవరకు ఇక్కడే ఉండు. గర్భ ప్రతిష్ఠ పూర్తి అయిన తరువాత ఇద్దరం కలిసి బ్రహ్మ దగ్గరకు వెడదాం" అని నారదుడు చెప్పాడు. (29- 33 )

రాజు నారదుని ఆదేశాన్ని అంగీకరించి మందిర నిర్మాణం ప్రారంభించాడు. శిల్పులను నియమించాడు. మందిర నిర్మాణంలో రాజు ధనానికి వెనకాడటం లేదు. కాంతి కోసం మధ్యలో మణులు పొదుగుచున్నారు. అనేక విలువైన వస్తువు దేవాలయ నిర్మాణానికి రాజు సేకరించాడు. రాజులు, దేవతలు ఆ భవన నిర్మాణాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. ( 34 - 56 )

" ముల్లోకాల వారు కలలో కూడా ఇలాంటి భవనాన్ని చూడలేదు.రాజుకి నారదుడు, బ్రహ్మ, సహాయంగా ఉన్నారు. విష్ణు భక్తులకు అసాధ్యమైనగది ఏది లేదు. విష్ణువుకి భక్తునికి మధ్య దూరం ఉండదు" అని దేవతలు మనస్సులో అనుకున్నారు.

మునీంద్రా!దేవతలకు,రాక్షసులకుసాధ్యంకాని భవన నిర్మాణం నాకు సాధ్యమైనది. సాక్షాత్ విష్ణువు ఆకాశ వాణి ద్వారా భవనాన్ని నిర్మించమని ఆదేశించాడు. ఆపని నేను పూర్తి చేసాను" అని రాజు నారదుని పాదాలకు నమస్కరించాడు. నారదుడు రాజును లేవనెత్తి," రాజా! నీకు నాకు భేదంలేదు. జగన్నాధుడు ఇక్కడ ఆవిర్భవించినా లేకపోయినా ఈ మూర్తులను ఆర్చిస్తూ ఉండు. నీ మనస్సులో భక్తి ఉన్నంత వరకు ఇంక ఏమి కావాలి?భక్తి ఉంటే , తీర్థాలు, మంత్రాలు, జపం మొదలయినవి ఏమి అక్కరలేదు. భక్తిచే నీవు అన్ని సాధించావు. నీవు చిరకాలం జీవించి, జగన్నాథుని అర్చిస్తూ ఉండు. నేను సప్తర్షులను తీసుకొని విగ్రహప్రతిష్ఠకు వస్తాను. అప్పుడు మనం బ్రహ్మలోకానికి వెడదాం" అని నారదుడు చెప్పాడు. ( 57-71)

స్కాందపురాణంలోని వైష్ణవఖండంలో పురుషోత్తమ కేత్రమాహాత్మ్యంలోని జైమిని ఋషి సంవాదము అను ఇరవై ఒకటవ అధ్యాయం సమాప్తం.

## 22 వ అధ్యాయం

## జైమిని ఋషి సంవాదము.

# నారద, ఇంద్రద్యుమ్నుల బ్రహ్మలోక యాత్ర.

" రాజా! ఈ పుష్ప రథాన్ని ఎక్కు. మనోవేగంతో వెడుతుంది" అని నారదుడు చెప్పాడు. ఇరువురు స్వామికి ప్రదక్షణ చేసి భక్తితో నమస్కరించి వచ్చారు. అందరి దగ్గర అనుమతి తీసుకున్నారు.

దివ్యవిమానంఎక్కిబ్రహ్మలోకానికిబయలుదేరారు.సూర్యమండలం చుట్టు ప్రదక్షణ చేసి,ధృవమండలానికి చేరుకున్నారు.అక్కడనుండిజనలోకానికిచేరుకున్నారు.అక్కడ ఉన్న సిద్ధులకి నమస్కరించారు. మహర్లోకానికి చేరున్నారు. అక్కడి సిద్ధులు స్వాగతం పలికారు. స్వామికి తాను నిర్మించిన భవనాన్నిగురించి, అశ్వమేధ యాగాలగురించి అక్కడ ఉన్న వారికి రాజు చెప్పాడు.

" నారదా! మనం ఇలావచ్చినతరువాతభవన నిర్మాణం సక్రమంగా సాగుతుందో, లేదో. శిల్పులు సమయానికి భవనం పూర్తి చేస్తారో,లేదో?సామంతులు నా రాజ్యాన్ని ఆక్రమిస్తారేమో"అనిరాజువిచారిస్తూండగా " రాజా! ఎందుకు విచారిస్తావు. మనం వచ్చిన ప్రాంతంలో విచారానికి తావు లేదు. బాధలు, వ్యాధులు, ముసలితనం. మృత్యువు ఉండవు. నీవు ధన్యుడవు. శరీరంతో బ్రహ్మలోకానికి వెడుతున్నావు. సాక్షాత్తు నారాయణుని దర్శించుకుంటున్నావు. తుచ్ఛమైన సంసారవిషయాలగురించి ఆలోచిస్తావా?" అనినారదుడు రాజును ఓదార్చాడు. ( 1- 24)

" స్వామి నేను సంసారంగురించివిచారించటం లేదు. నేను తలపెట్టిన భవనం ఎక్కడ ఆగిపోతుందో? అనివిచారిస్తున్నాను"అనిరాజునారదునికివివరించాడు.

"రాజా! నువ్వు సామాన్యుడవు కావు.ఎవరికి అపకారం చేయలేదు. నీవు తలపెట్టిన కార్యం స్వామికి ప్రీతికరమైనది.బ్రహ్మలోకానికిచేరుకున్నావు.ముల్లోకాలు తిరిగావు . నీపై ఎవరు దాడి చేయగలరు." ఈవిధంగా నారద,ఇంద్రద్యుమ్నులు మాటాడకుంటూ బ్రహ్మ లోకానికి చేరుకున్నారు. ( 25 - 32 )

మహర్షులు చదువుతున్న వేదాధ్యనం వినబడుతోంది.పురాణాలు,స్మృతువు చదువుతున్నారు. బ్రహ్మ సభ నడుస్తోంది. ఈ లోకంలోకి వచ్చినవారికి సంసార బంధాలు ఉండవు. దీనినే సత్యలోకం అని పిలుస్తారు. ఈ లోకానికి పైన ఏమి లేవు.బ్రహ్మలోకానికి పక్కన కపాల లోకం ఉంది. దానికి క్రింద వైకుంఠం ఉంది.

నారదునితో కలిసి వస్తున్న ఇంద్రద్యుమ్నుని చూసి ద్వారపాలకులు తలవంచి నమస్కరించారు." నారదా! మీరులేక బ్రహ్మ సభకు నిండు లేదు.మహర్షులు అందరు మీరాకకోసం ఎదురు చూస్తున్నారు" అని పలుకుతూ ద్వారపాలకులు నారదునికి దారి ఇచ్చారు.


( 33-48)

స్కాంద పురాణంలోని వైష్ణవ ఖండంలోని పురుషోత్తమక్షేత్ర మాహాత్మ్యంలో జైమిని ఋషి సంవాదం అను ఇరవైరెండవ అధ్యాయం సమాప్తం

(ఇంకా వుంది)

# వేదులాన్వయు పలుకు

వేదుల సుబ్రహ్మణ్యం



సరళ మగురీతి సందర్భ సముచితమగు
తెలుగు పద్యసుమములను తేటగీతి
మాలగా గూర్చి అందింప మనసు బడితి
సరస మెంచి గుణంబుల నరయ వినతి II

శారదాంబను మదినిల్పి శరణు వేడి
విద్యనర్థింప వెనుకటి వెతలు తొలగి
కామితార్థము సిద్ధించు కరుణ మీర
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 1

అమ్మ పాల్ద్రావి పెరిగి పెద్దయిన వాడు
ఇతర మగుభాష లెన్నింటి నెరిగియున్న
మాతృభాషను మరచి తా మసల బోడు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 2

శక్తి వంచన లేకుండ శ్రమకు నోర్చి
కూడబెట్టిన ధనములో కొంతయైన
దాన ధర్మములను సల్ప ధన్యుడగును
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 3

ఆచరించని సలహాల నంటగట్టి
సామరస్యము పేరిట సరసమనుచు
పెద్దరికమును పణముగ బెట్టకు సుమ!
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II

సుగుణ సంపత్తి మించిన సోయగంబు
మనుజునకు నుండ దీభువి మరల వేరె
బాహ్య సౌందర్యములు కాల ప్రాభవములు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 5

హావభావాలు కలబోసి అవసరార్థ
మొరుల మెప్పింప సలుపు కుయుక్తులందు
చిక్కు కొనకుండ నుండిన క్షేమమమరు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 6

ఆకలికి నోర్వజాలక నలమటించు
వానికిన్నాలు పిడికెడు వంటకంబు
భూరి విందును కోరడు భువినెవండు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 7

ధనము ధాన్యము వస్తువాహనము లుండి
మడులు మాన్యాల నేలినా మమత లేని
కాపురంబందు సఖ్యత కలుగ దెపుడు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 8

ఆయురారోగ్య సంపద లమరికూడ
తృప్తి సౌఖ్యము పూర్తి శాంతియును లేని
జీవితంబందు నేముండు చింత తప్ప?
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 9

వాస్తవంబును గుర్తించి బాధ్యతరసి
నిత్యకృత్యములను సల్పు నేర్పునెరుగు
గాలిమేడలలో దేలి కలలు గనకు!
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 10

# సప్త మోక్ష నగరాలు



కొత్త రామానందం

జీవితం ---- ముఖ్యంగా మానవ జీవితం గొప్పది. అమూల్య మైనది. ఆధ్యాత్మిక లో చెప్పాలంటే దుర్లభమైనది. కేవలం లౌకిక జీవితాన్ని ఆరాధించే వారి సంగతి పక్కనుంచితే భగవంతుడే పరమావధిగా ఆయనను పొందేందుకే మానవ జీవితం అనే స్పృహ కలిగి, ఆ గమ్యానికే దృఢ చిత్తంతో సమాయతమైన వారికి జీవితం అపురూపమై నది. మానవ జన్మ ఓ దివ్య వరంగా లభించింది. దీనిని దుర్వినియోగం చేసుకోకూడదంటారు మన పెద్దలు. జ్ఞానం లేకుండా ముక్తి లక్తి భించదు. అందుకే మహాపుఋషులను ఆశ్రయించి, ఆత్మ --పరమాత్మ జ్ఞానం పొందాలి. ధర్మార్ధ  కామమోక్షాన్ని విడిచి మధ్య ఉన్న అర్ధ  కామాల వెంట నేటి మనిషి పరుగులు చేస్తు న్నారు. పరమాత్మ పట్ల చిత్తం అంటే మనసును లగ్నం చేయాలి. మన మనసు ప్రవర్తనను నిరోధించడమే యోగం.

ఎన్ని ఒడుడుకులు ఎదురైనా పదిలంగా బతకాలని ప్రతి జీవి తాపత్రయపడుతుంది. అందులో ప్రమాదరహితంగా, ప్రమోద భరితంగా సాగాలనే కాంక్ష అంతర్లీనమై ఉంటుంది. జటిల సమస్యలు ఎదురైనప్పుడు ఏమైనా మహిమాన్విత శక్తి తనకు సహక క్తి రించాలని ఆశించడం సహజం. భగవంతుని అనుగ్రహం పొంది, సమస్యలను అధిగమించగల శక్తి పొందాలనే ప్రయత్నమే --- భక్తి మార్గం. భగవంతుడు అపార కరుణా సముద్రుడు. దయాళుడు. ఆయన మానవునికి సద్బుద్ధినిచ్చి సన్మార్గంలో నడిపిస్తా డు. అందరికీ ప్రేరణ ఇస్తాడు. ఆయన ప్రేరణ జగతి జాగృతికి ఆధారం. భవ బంధాలనుండి విముక్తి చేయడానికి ఎన్నెన్నో మార్గాలు చూపాడు. ఎన్నో దివ్య ధామాలను సృష్టించాడు.  వేదాలు పుట్టిన ఈ పవిత్ర భూమిపై ముక్తి ధామాలుగా సప నగరాలు ఉన్నాయి. అందు పరమాత్మ అనేక అనేక అవతారాలుగా ఉద్భవించి దుష్ట శిక్షణలు గావించి తన మహిమలతో కృపాదృష్టితో కాపాడుతున్నాడు, మరియు నూతనోత్సాహాన్ని నింపుతున్నాడు.. "అయోధ్యా, మధురా మాయా, కాశీ కంచి అవంతికాపురి ద్వారవతి చైవ సప్తైతే మోక్ష దాయకా" భారత దేశంలో అనేక దివ్య క్షేత్రాలు ఉన్నాయి. అయితే సప మోక్ష నగరాలు మోక్ష ధామాలుగా ప్రసిద్ధి గాంచి మనందరకూ సుఖ శాంతులు, విజయ కాంతులు ప్రసాదిస్తు న్నాయి. అందువల్ల మనకు ఆధ్యాత్మిక చైతన్యం విరాజమానమై దైవం పట్ల భక్తి ప్రపక్తి త్తులు పెరిగి ఆత్మ విచారణ చేయగలుగుతున్నాము. ధర్మ బద్ధమైన జీవనాన్ని ఎంపిక చేసుకుని పుణ్య క్షేత్రాలను సందర్శిస్తూ ముక్తి కోసం ప్రయత్నించడం మన ధ్యేయంగా చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత కాలంలో సప్త మోక్ష ధామాలను దర్శించి పునీతులమవ్వాలి. భగవంతుడు భక్తుని నుండి కోరుకునేది కూడా అదే.

ఆసేతు హిమాలయ పర్యంతం వ్యాపించిన మన భారతావనిలో ఎన్నో జాతులు, తెగల ప్రజలు, భాషలు ఉన్నా మొత్తం జాతినంతటినీ సమైక్య పరచి ముందుకు నడిపిస్తోంది మన సనాతన సంస్కృతి. అట్టి సంస్కృతికి ప్రతిరూపాలు మన పుణ్య క్షేత్రాలు, తీర్థాలు. వాటిలో అనాదికాలం నుంచి విఖ్యాతి చెంది భక్తులకు మోక్షదాయికాలుగా ఏడు పుణ్య క్షేత్రాలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి.

అవి **అయోధ్య, మధుర, మాయ (నేటి హరిద్వార్), కాశీ, కంచి, అవంతిక(నేటి ఉజ్జయిని) మరియు ద్వారక.**

# మాయ (నేటి హరిద్వార్)



మోక్ష నగరాలలో రెండవది 'మాయ'. ఈ మాయాపురియే మనందరికి చిరపరిచయమైన 'హరిద్వార్'.. పూర్వకాలంలో దీని ని 'మాయాపురి' అనేవారట. పురాణకాలం నుంచి భక్తులు ఈ పుణ్యస్థలిని దర్శించి పునీతులైనట్లు భావించేవారు. మాయాపురి ప్రాశస్త్యాన్ని విపులంగా గరుడపురాణంలో వివరింపబడింది. మాయా అనే పదం అమ్మవారి అనేక నామాల్లో ఒకటి. ఇదీకాక పరమశివుని అర్ధాంగి సతీదేవి జన్మించి సంచరించిన స్థలం. దక్ష ప్రజాపతి యొక్క రాజధాని ఈ మాయాపురియే.

దక్షయజ్ఞం ఇక్కడనే జరిగింది. మరియు శివనింద భరించలేని సతీదేవి దేహ త్యాగం ఈ క్షేత్రంలోనే జరిగింది. దక్షుని పునర్జీవితుని చేసిన శివుడు 'దక్షేశ్వర స్వామి' గా ఈ పుణ్య భూమిపై అలరారుతున్నాడు. కపిల మహాముని ఆశ్రమం ఇక్కడ ఉండడం వల్ల గంగామాత ఇక్కడకి ప్రవహించి ఈ ప్రాంతాన్ని పునీతం చేసిందంటారు. నాటికీ, నేటికీ తపోభూమిగా విరాజిల్లుతున్నది.

చైనా యాత్రికుడు హ్యూవాన్ త్సాంగ్ క్రీ. శ. ఒకటవ శతాబ్దంలో తన భారతదేశ యాత్రలో భాగంగా హరిద్వార్ ను సందర్శించి, అప్పటి కుంభమేళాలో పాల్గొన్నాడు. ఆయన రచనల ద్వారా ఈ క్షేత్రాన్ని 'మాయాపురి' అని పిలిచేవారని రూఢి అయింది. క్రీ. శ. 10 వ శతాబ్దం నుంచి 15 వ శతాబ్దం వరకు అనేకసార్లు ముహమ్మదీయులు ఈ క్షేత్రంపై దండెత్తి ఎంతో సంపత్తిని కొల్లగొట్టటమే కాక ఆలయాలను, అందలి విగ్రహాలను ధ్వంసం



చేశారు. అయినా మనవారు వాటిని పునర్నిర్మించుకుంటూ భారతీయ సంస్కృతీ, వైభవాన్ని కాపాడుకుంటూ వచ్చారు. మొగల్ చక్రవర్తి అక్బరు బాదుషా ఈ ప్రాంతాన్ని సందర్శించి, తన ప్రియ మిత్రుడు రాజా మాన్ సింగ్ పేరు మీద 'మాన్ సింగ్' సత్రం కట్టించాడట. ఈ పుణ్యధామమైన హరిద్వార్ ను ఎందరెందరో బౌద్ధ, జైన యోగులు, బ్రిటిష్ పాలకుడైన డల్హౌసీ దర్శించి, యాత్రికుల సౌకర్యార్థం అనేక సౌకర్యాలు సమకూర్చారు.

ఇంతగా పౌరాణిక, చారిత్రిక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యం ఉన్న హరిద్వార్ క్షేత్రంలోనే హిమాలయాలలో ఉద్భవించిన గంగమ్మ తల్లి మొదటిసారి నదీరూపాన్ని సంతరించుకుని చక్కగా, వయ్యారంగా వేగంగా పారుతుంది. ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తుంది. ఈ క్షేత్రమందు అనేక యోగులు, ఋషీశ్వరులు ఆశ్రమాలు నిర్మించుకుని యజ్ఞయాగాదులు కావిస్తూ, భక్తులకు జ్ఞాన భిక్ష ప్రసాదిస్తున్నారు. మరియు వేదపాఠశాలలు నెలకొల్పి భారతీయ సనాతన ధర్మ పరిరక్షణ చేస్తున్నారు.

**శీతల గంగా తరంగాలు:**

ఈ పుణ్యధామంలో పవిత్ర గంగానది అన్ని కాలాలలో అన్ని వేళల్లో పారుతూ భక్తులను పునీతం చేస్తూ ఉంటుంది. మంచు ఉన్న అతి శీతలమైన నీరు వేగంగా ప్రవహిస్తూ అనేక పురాతన దివ్య క్షేత్రాల మీదుగా పయనిస్తూ భూలోకవాసులను పునీతం చేస్తున్నది. దివి నుంచి భువికి దిగివచ్చిన గంగామాత గురించి కొద్దిగా ముచ్చటించుకుందాం.

(ఇంకా వుంది)

# సినిమా



నండూరి సరోజాదేవి

"ఆ ప్రోగ్రాం కి గాయని P.సుశీల గెస్ట్ అయితే..ఉపద్రష్ట సునీత యాంకరింగ్ చేసింది" :- ఇది వారి ఇరువురి మధ్యన సరదా నవ్వుల సంభాషణగ కూడా జరిగింది. ఆ వివరాలు ఇలా..

సునీత:- "మీరు నేర్చుకున్నవన్నీ చెబితే..ఆ మీ అనుభవాలే మాకు పాఠాలు అవుతాయి!"

సుశీల:- "నేను ఏదో నేర్చుకున్నాను-,పాడాను..50 ఏళ్ళు అలా గడిపాను!"

*అంతకంటే, ముందు బాలసరస్వతి గారు వున్నారు. లీల గారు, జిక్కీ వీళ్ళందరూ పాడారు. వాళ్లందరినీ కూడా అవి అడగాలి మీరు?

"వాళ్ళని నేను ఫాలో చేశాను..నన్ను మీరు, ఈ తరం ఫాలో చేయాలి" ( పాటలకి ).ఒకళ్ళు పాడింది, ఇంకొకళ్ళు పాడడం ఈజీ అవుతుంది అండీ!

"కొత్తగా పాట ఇచ్చినప్పుడు దాన్ని ఒప్పించాలీ..ఎలాగూ సినిమా పాటలు పాడతారుగా?"

** "నేను కూడా లతా మంగేష్కర్, ఆవిడ పాటలు పాడే పైకి వచ్చాను." నా అదృష్టం బాగుండి.. సినిమా తెలుగు తల్లి, సినిమా కళామ తల్లీ నాకు భిక్ష పెట్టింది. నేను దాంట్లో రాణించాను!

"ఇప్పుడు చిన్న పిల్లలు, పెద్ద పిల్లలు కూడా నా పాటలు పాడుతున్నారు".. నా అంటే నా సొంతం అని కాదు,నా గాత్రం నుండి వచ్చే ఆ పాటని వాళ్ళు పాడి ఒప్పిస్తున్నారు!

ఎందుకంటే! "నేను చెప్పేది..ఈ 50 ఏళ్ళ జీవితంలో నే నేర్చుకున్నదీ."

వాళ్ళు అంతా ఈ కాలానికి తగినట్టు దాన్ని మార్చుకుని, ఆ పాటలని మలచుకుని పాడాలీ! ఇప్పుడు పాడుతున్న పాటలు వాళ్ళకి అనుభవాలు ఇస్తాయి. అందరూ పాడాలి, వాళ్ళు పెద్ద పెద్దవాళ్ళు అవ్వాలి.. పాటల్లో వారి వారి పేరుని నిలపాలీ.

"నేను పాడుతున్న పాటలు,వాళ్ళు అందరూ పాడుతూ ఉంటే" నా పేరు కూడా నిలుస్తుంది కదా మరి అక్కడ?" (హాస్యము,నవ్వు)

*కొత్త సినిమాలలో కూడా సంగీతం అంత కానిదేం చేయటం లేదు.. వాళ్ళకి కొన్ని పాటలు చాలా బాగా వస్తున్నాయి! ఎప్పుడూ పాత పాటలే వింటుంటే ఎలా..కొత్త పాటలు కూడా రావాలి కదా?

"ఎప్పుడూ పాయసమే తాగుతారా? ఆవకాయ ముక్క కూడా తినాలి కదా?" (వాళ్ళ మధ్య నవ్వులు)

సునీత:- "అప్పుడు ఆ హేపీ పాటలు మీరు పాడారు కదా?"

సుశీల :- "నేనూ పాడాను.అప్పుడు అవి అన్నీ పాడేయడంతో, అదంతా అయిపొయింది..ఇప్పుడు అది మీకు చెప్తున్నాను. (చిరునవ్వు)

**దీని తో వీరి ఇరువురి సంభాషణా పూర్తి అయ్యిందీ!

00000000

** ఒక రచయిత్రి ని అయినా, నేను ఇక్కడ.. శ్రీమతి P.సుశీల గారి మాటలు ఎందుకు చెప్పాను అంటే? "ఆవిడ సహితం.. లతా మంగేష్కర్ వంటి గాయనీ మణి పాటలని విని నేర్చుకున్నాను అని అన్నారంటే?" సుశీల వంటి మహా గాయకురాలు,-సినీ గీతాల సామ్రాజ్ఞని కూడా, తన సీనియర్స్ ని చూసి నేర్చుకున్నట్టే కదా? ఎటువంటి భేషజము లేకుండా, తన అనుభవాన్ని అందరూ గ్రహించి నేర్చుకోవాలనే భావనతో విడమర్చి చెప్పడం అన్నది ఎంతో విశేషమే కదా



అలాగే, నా ఉద్దేశ్యం ప్రకారంగా ఇప్పటి "సినీ నటీ నటులు, గాయనీ-గాయకులూ, డైరెక్షన్, మ్యూజిక్ తదితర విభాగాల ముఖ్యులు అన్నవారు, ఆ సీనియర్ పర్సన్స్ నుండి తప్పక..వారి అనుభవాలనూ క్షుణ్ణంగా గ్రహించి నేర్చుకోవడం వలన.. తెలుగు సినీ పరిశ్రమ పేరు-ప్రఖ్యాత కి సహితం మేలు చేకూరుతుందన్నది కూడా.

అంతే కాదు! మరిన్ని ఉదాహరణలు, వివరణలు తీసుకోవాలంటే.. ఈ సినిమా చరిత్ర నుండి ఎన్నో ఉంటాయి! "ముఖ్యంగా కొంత మంది సినీ డైరెక్టర్లు, వారి అసిస్టెంట్స్ డైరెక్టర్లుగా పని చేసిన కొద్ది మంది గురించి చెప్పుకుంటే."

గతంలో వారు కొందరు సీనియర్స్, వయసు మీరి మరణించినప్పటికీ..

2.** ఇప్పటి సుప్రసిద్ధ దర్శకులు K.విశ్వనాథ్ గారిని తీసుకుంటే.."-మంచి సంగీత,నృత్య నేపథ్యంతో ఎన్నో పేరెన్నిక గన్న చిత్రాలను తీసిన వారు కూడా" ప్రారంభంలో దర్శకులు ఆదుర్తి సుబ్బారావు గారి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్ గా పని చేసిన వారేనటా.

అలాగే! కీ.శే,దాసరి నారాయణ గారి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్లుగా..రేలంగి నర్సింహారావు,కోడి రామకృష్ణ వంటి వారు పనిచేసారు అన్నది విదితమే! వారు ఇరువురి డైరెక్షన్ లో ఎన్నో ఏళ్ళు, ఎంతెంత మంచి సినిమాలు వచ్చాయో అందరికీ తెలుసున్నదే.

ఇక దర్శకేంద్రులు కే.రాఘవేంద్రరావు గారిని తీసుకుంటే.. వారి దగ్గర అసిస్టెంట్లుగా పని చేసి, ఇప్పుడు ఎంతో గొప్ప గొప్ప సినిమాలు తీసిన



స్థాయిలో వున్న"కోదండరామి రెడ్డి, బి.గోపాల్, రాజమౌళీ లు" డైరెక్టర్లుగా పేరొంది వున్నారు!

ఇక పూరి జగన్నాథ్, కృష్ణ వంశీలు అయితే.. ప్రసిద్ధ దర్శకులు రామ్ గోపాల్ వర్మ దగ్గర అసిస్టెంట్స్ గా అనుభవం పొంది,"ఆ తర్వాత తమ తమ సినిమాల ద్వారాఎంతో పెద్ద డైరెక్టర్లు గా పేరు గడించడం" ప్రేక్షకులు అందరికీ తెలిసున్నదే.

వీరందరూ,సీనియర్స్ వెనక "వందల కొద్దీ సినిమాలకి అసిస్టెంట్ గ"పనిచేసి ఉండక పోవచ్చును. ఏదో ఒక్క సినిమా పట్ల తర్ఫీదు పొందినా చాలు..చిత్ర రంగాన వారెంతో పెద్ద డైరెక్టర్లు గా నిలదొక్కుకోడానికి!

000000000

3.అలాగే! ఈ సందర్భంలోనే కొంత మంది మ్యూజిక్ డైరెక్టర్స్ విషయాల గురించి కూడా క్లుప్తంగా, అనుకుంటే,అవగాహన కలుగుతుంది కాబట్టి..అవీ కొన్ని రాసే ప్రయత్నం చేయడం అవుతోంది.

** ఎంతో గొప్ప సంగీత దర్శకులైన కీ/శే K.V. మహదేవన్ గారు కూడా,ఈ సినీ సంగీత ప్రస్థానం లోకి అడుగు పెట్టిన ప్రారంభంలో..అప్పటి మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.వీ. వెంకట్రామన్ దగ్గర సహాయకులుగా పనిచేసిన వారే నట!

ఇక! సంగీత దర్శకులు,నటులు అయిన కీ .శే. K.చక్రవర్తి గారి దగ్గర.. చలన చిత్ర దర్శకులు కోటి (సాలూరి కోటేశ్వరావు) కెరీర్ మొదట్లో అసిస్టెంట్ గా పని చేశారట!

అంతేకాదు! మణిశర్మ, ఏ.ఆర్. రెహమాన్ వారి కెరీర్ ప్రారంభంలో .. "కీ బోర్డు ప్రోగ్రామర్స్" గా మ్యూజిక్ డైరెక్టర్ కోటి తో కలిసి వర్క్ చేసేవారట.

మ్యూజిక్ మాస్టర్, మ్యూజిక్ డైరెక్టర్, "మ్యూజిక్ మ్యాస్ట్రో" అనే గొప్ప పేరు సంపాదించిన ఇళయరాజా దగ్గర, ముందులో ఏ.ఆర్.రెహమాన్ అసిస్టెంట్ గా వర్క్ చేసే వారట.

** "ఇలా చెప్పుకుంటూ పోతే ఒకళ్ళు-కాదు, ఇద్దరు కాదు..సినీ రంగాన ఒక విభాగమనీ లేదు, ఒక అంశం తోనూ అయిపోదు"అందుకే, మిగిలినవి ఇక తర్వాత మళ్లీ తెలుసుకుందాము!

సశేషము,

# నూటపదహార్లు కందాల్లో
# సుందరకాండ



పాలెపు బుచ్చిరాజు

## మనవి

వాల్మీకి రామాయణం మహోత్కృష్టమైన కావ్యం. ఎవరె న్నిసార్లు రాసినా ఇంతకంటే ఎక్కువగా ఏం చెప్పగలరు? యావద్భారత దేశంలో ఎన్నో భాషల్లో ఎందరో మహానుభావులు రచించి, చదివి, విని ధన్యులయ్యారు. ఉత్తర భారత దేశంలో గోస్వామి తులసీదాసు రచించిన “రామచరితమానస్” కి ఉన్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. అఖండ రామాయణ పారాయణం, సుందర కాండ పారాయణం, హనుమాన్ చాలీసా ప్రతి రోజూ ఎక్కడో ఒక దగ్గర వినిపిస్తూనే ఉంటాయి. తెలుగులో కూడా వెయ్యేళ్ళుగా వేలాది భక్తులు రామాయణాన్ని రాసి, చదివి, విని తరించారు.

రామాయణంలో రాముడి తరవాత విశిష్టమైన పాత్ర హనుమది. స్వామి భక్తికి, కార్య దీక్షకి, బుద్ధికుశలతకి కొలమానంగా చిత్రించాడు వాల్మీకి. అసలు రామాయణంలో సుందర కాండ ప్రత్యేకంగా హనుమ కోసమే సృష్టించ బడింది అనిపిస్తుంది. సీతాన్వేషణలో హనుమ చేసిన అద్భుత కార్యాలకి అబ్బురపడి శ్రీరాముడు “నువ్వు నా తమ్ముడు భరతుని వంటి వాడవ”ని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. భక్తి తత్వానికి ఉదాహరణగా రచించ బడింది కనుకనే సుందర కాండ ప్రత్యేకంగా పారాయణకి నోచుకుంది.

నాటి రామదాసు, త్యాగరాజు నుంచి, నేటి ఎం.ఎస్. రామారావుగారి వరకు ఎందరో మహానుభావులు శ్రీరామ హనుమలను కీర్తించడం ద్వారా ధన్యులయ్యారు.

వారిని స్ఫూర్తిగా తీసుకుని ‘వంద కందాల్లో సుందర కాండ’ రాద్దామనే ప్రయత్నం చేశాను. ‘అష్టోత్తర శతం’ దాటినా హనుమంతుని తోకలా పెరుగుతూ పోయింది. ఆఖరికి ‘నూటపదహార్లు’ తో పూర్తి చేయ గలిగాను. చదువరులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఆఖర్న అనుబంధంగా “పురజన గీత” గా పద్దెనిమిది కందాలు చేర్చాను. పట్టాభిషేకం తరవాత శ్రీరాముడు తమ్ముల్ని, మంత్రుల్ని, సామంతుల్ని, సైన్యాన్ని ఉద్దేశంచి ఎవరెలా మసలుకోవాలో మాట్లాడాక, పుర ప్రజల్ని కూడా పిలిపించి వారికి భక్తి తత్త్వం బోధిస్తాడు. ఆ కారణంగానే దీనికి ‘పురజన గీత’ అని పేరు. తులసీ రామాయణం ఆధారంగా రాసిన పద్యాలు.

బరోడా

పాలెపు బుచ్చిరాజు

1) సుందర రూపుడు రాముడు
సుందరి సీతనెడబాసి సోలుచు తిరిగెన్
ఎందెందు సీత గానక
కుందుచు భూమిజ దలంచి కూలంబడియెన్

1) సీతారామ లక్ష్మణులు వనవాసంలో ఉండగా రామ లక్ష్మణులు ఆశ్రమంలో లేని సమయం చూసి రావణుడు సీతను అపహరిస్తాడు. అన్నదమ్ములిద్దరూ అరణ్యమార్గంలో ఆమెను వెదుకుతూ ఉంటారు. సీతావియోగం భరించలేక రాముడు చాలా బాధపడుతూ ఉంటాడు.

2) లెమ్మా రామా యనుచును
తమ్ముడు చేయూతనిచ్చి తట్టుచు లేపెన్
అమ్మను దెచ్చెద వగవకు
తమ్ముని నమ్ముము పయోధి దాటియు నైనన్

2) అప్పుడు లక్ష్మణుడు అన్నగారిని ఓదార్చి సీత క్షేమంగానే ఉండి ఉంటుందనీ, ఎంతటి కష్టమైనా ఓర్చి పర్వతా-లు సముద్రాలు దాటి అయినా సరే సీత జాడను కనుక్కుంటానని చెప్పి ఊరడిస్తాడు.

3) వారిని మారుతి కనుగొని
మీరలు మహనీయులగుట మేలగు మీకున్
మారుతి యందురు నన్నిట
నా రాకకు కారణంబు నయముగ వినుడీ!

3) వారలా అడవుల్లో తిరుగుతూ ఉండగా హనుమంతుడు వారిని చూసి మహనీయులుగా గుర్తించి,వారిదగ్గర-కు వస్తాడు. తనను తాను పవన పుత్రునిగా పరిచయం చేసుకుని , తన రాకకు కారణం చెపుతానని అంటాడు.

4) వాలి యుదంతము చెప్పగ
జాలిగ "సుగ్రీవు గాచి జయమిప్పింతున్
ఆలస్యమేల నడువుడు
వాలిని జంపుటది యెంత వాయుకుమారా"

4) వాలి సుగ్రీవులనే అన్నదమ్ముల కథ వినిపించి, అన్నగారు తమ్ముడిని యుద్ధంలో ఓడించి, భార్యను, రాజ్యాన్ని కాజేసాడని ఆ కథనంతా వివరంగా చెపుతాడు. సుగ్రీవునితో మైత్రి ఉభయతారకంగా ఉంటుందని ఆశాభావం. వ్యక్తం చేస్తాడు.

5) అని పలుకగ శ్రీ రామడు
వినయముతో వంగి హనుమ వేగమె నడచెన్
వనచరుని వెనుక నడిచెను
అనుయాయుని తోడ గూడి అన్నయు వడిగా

5) రాముడు వాలిని చంపి సుగ్రీవునికి రాజ్యాన్ని, భార్యను ఇప్పిస్తానని మాట ఇస్తాడు. హనుమంతుడు చాలా సంతోషించి, రామ లక్ష్మణుల్ని తన వెంట తీసుకుని వెళ్తాడు.

6) చేతులు కలిపి కపివరుడు
సీతను కనుగొన గలమని సేనల జూపెన్
చూతువు వాలిని బాణము
నేతును నమ్ముమని రాము డింపుగ పలికెన్

6) రాముడికి, సుగ్రీవుడికి స్నేహం కలుస్తుంది. రాముడు వాలిని చంపి, సుగ్రీవుడిని తిరిగి రాజును చేస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. సుగ్రీవుడు తన పరివారాన్ని చూపించి, వారిలో వీరులు, బలవంతులు, యోధులు ఉన్నారని, సీత జాడ తప్పక తెలుసుకోగలరని మాట ఇస్తాడు.

7) వాలిని వధించి రాముడు
పాలన సుగ్రీవుకిచ్చి ప్రతినను నిలిపెన్
పాలకుడంపెను సేనల
మేలుగ జానకి వెదుకగ మేలగు నంచున్

7) వాలి సుగ్రీవులు యుద్ధం చేస్తుండగా రాముడు ఒక్క బాణంతో వాలిని చంపుతాడు. తన ప్రతిజ్ఞ ప్రకారం, సుగ్రీవుని వానర రాజ్యానికి రాజును చేసి పట్టాభిషేకం చేస్తాడు. కృతజ్ఞతా భావంతో, సుగ్రీవుడు,తన సైన్యాన్ని నాలుగు భాగాలుగా చేసి నాలుగు దిక్కులా సీతకోసం వెదికి, జాడ తెలుసుకుని రమ్మని పంపుతాడు.

8) పావని వంతుకు వచ్చెను
పోవగ దక్షిణముగాను భూమిజ జూడన్
సేవకు పొమ్మని రాజనె
నీవే మా యాశలన్ని నిజముగ హనుమా!

8) సుగ్రీవుని ఆజ్ఞ మేరకు హనుమంతుడు దక్షిణ దిక్కువైపుగా ప్రయాణమై వెళ్తాడు. హనుమంతుడు ఎంత కష్టమైన పని అయినా తేలిగ్గా సాధించుకు రాగలడనే ధైర్యం సుగ్రీవునికి ఉంది.

(సశేషము)

# కర్మ చండాలుని దోషములకు నిష్కృతి లేదు

వేంకటాచార్యులు

జాతి చండాలునికి కాలాంతరమున భగవద్భక్తుడు అయ్యే అవకాశం ఉంది. కానీ దోషపూరితమైన క్రూర కర్మలతో భాగవతాలను మానసిక,-శారీరక బాధలకు గురిచేసే వాడు కర్మ చండాలుడుగా పిలువబడతా-డు. జన్మతః ఛండాలుడు భగవం-తుని అనుగ్రహం లభిస్తే ఒక్కొక్క మెట్టు పైపైకి చేరి ఎపుడో ఒకప్పుడు పరమ భాగవతోత్తముడుగా మారే అవకాశం ఉంది. కర్మ ఛండాలుడు పై మెట్టు నుండి క్రిందకు తోసివే-యబడతాడు. దాంతో నశించడం తప్ప తిరిగి ఉద్భవించే అవకాశం ఈ సృష్టి అంతం వరకూ అవకాశ-మే లేదు. ఉదాహరణకి త్రిశంకు-డు ఆకాశంలో తలక్రిందులుగా ఈ జగత్తు ఉన్నంతవరకూ తిరుగు-తూనే ఉంటాడు. ఈ విషయాన్ని వివరంగా తెలుసుకుందాం.

ఇక్ష్వాకు వంశంలో పురుకుత్సు-నికి త్రయ్యారుణి కుమారుడు. ఇతని కుమారుడు సత్యవ్రతుడు. ఇతని భార్య సత్యవ్రత. సత్యవ్రతు-డు తన పరాక్రమాన్ని ప్రదర్శించి రాజ్యాధికారాన్ని చేపట్టాడు. పరిపా-లన సక్రమంగా కొనసాగుతోంది. కొంతకాలం తరవాత రాజు తన పు-రోహితులు వశిష్ఠులవారిని పిలిచి, తాను దేహంతో స్వర్గం చేరి ఈ శరీరంతో స్వర్గ సౌఖ్యాలు అనుభ-వించాలని కోరికగా ఉంది. నా కోరిక నెరవేర్చుటకు మీరు ఏ కార్యక్ర-మం చేపట్టాలన్నా నేను సిద్ధంగా ఉన్నాననగా వశిష్ఠులవారు 'మీరు కోరిన కోరిక సరియైనది కాదు, పైగా అసాధ్యమయినది' అని తెలియ-చేశారు. దాంతో సత్యవ్రతుడు పట్టు-వదలని విక్రమార్కునిలా వశిష్ఠుని కుమారుల చెంతకు వెళ్ళి నమస్క-రించి, 'గురుపుత్రులారా! మీ తండ్రి గారితో సమానంగా మీరు కూడా మాకు ఆచార్యులు. అందువల్లనే నా కోరిక తెలియజేస్తున్నా. ఈ సృష్టిలో ఎవ్వరూ పొందలేని విధంగా నేను నా శరీరంతో దేవేంద్ర లోకం చేరి స్వర్గ సౌఖ్యాలు పొందాలి. దీని కొరకు మీరు ఎటువంటి యజ్ఞయాగాదు-లు నిర్వహిస్తామన్నా, ఎంతమంది-తో నిర్వహిస్తామన్నా నేను సిద్ధంగా ఉన్నా. ఆజ్ఞాపించండి' అని అంటే వశిష్ఠుల వారి కుమారులు 'ఈ వి-షయాన్ని మా తండ్రి గారికి తెలి-యజేశారా?' అని ప్రశ్నించగా సత్య-వ్రతుడు 'మీ తండ్రిగారిని అడిగా. నావల్ల కాదని తెలియజేయడమే కాదు, నన్ను అవమానించడం కూడా జరిగింది. కనీసం మీరైనా నా కోర్కె నెరవేర్చి ఇక్ష్వాకు వంశం కీర్తి ప్రతిష్ఠలు పెంచుతారని కోరుకుం-టున్న' అన్నాడు. దాంతో వశిష్ఠుని కుమారులు 'ఓ రాజా! నీవు మా తం-డ్రిగారి శిష్యుడవు. శిష్యునిగా నీకు ఏది హితమో తెలియజేయవలసి-నది మా తండ్రిగారు. వారు నిన్ను ఈ కోరిక విరమించుకోమని చెప్పారు. గురువుగారి మాట కాదనడం, ని-ర్బంధించడం మంచిది కాదు. వారు నీ శ్రేయస్సు కోరేవారు గాన బుద్ధిగా నీ కోరికను విరమించు-కో' అని తెలియజేశారు. మీరు, మీ తండ్రిగారు కాదన్నారు గాన నా కోర్కె నెరవేర్చుకోవడానికి మరో గురువును వెతుక్కుంటా అని రాజు చెప్పగా, వశిష్ఠ పుత్రులు కోపంతో 'చండాలత్వం గమిష్యసి' (ఛండాల-త్వమును పొందుదువు గాక) అని శపించారు. సత్యవ్రతుడు చిన్ననా-టినుండి దోషంతో కూడిన పనులు చేస్తూ తల్లితండ్రులను మానసికం-గా బాధిస్తూ వారి పరువు ప్రతిష్ఠలకి

ఇబ్బంది కలిగించేవాడు. రాజ్యంలోని ఒక పౌరుని భార్యను అపహరించి రాజభవనంలో ఉంచి ఆమెతో కాపురం చేసాడు.ఇటువంటి అనేక పనులతో తండ్రి విసిగి... కుమారుని బయటకు పొమ్మన్నాడు. నేను ఎలా బ్రతకాలి అని కుమారుడు అడిగితే తండ్రి 'నీవు పుట్టుకకు ఛండాలుడవు కాకపోయినా కర్మ ఛండాలునిగా బ్రతుకుతున్నావు గాన వాళ్ళు తినేదే తిని బ్రతుకు పో' అన్నాడు. ఆ సమయంలో వశిష్ఠులవారు అక్కడున్నా తన తండ్రికి తన పట్ల జాలి కలిగే విధంగా నచ్చజెప్పే ప్రయత్నం చేయలేదని వారిపై కోపం పెంచుకున్నాడు. అడవికి చేరాడు. మృగాలను వేటాడి లభించిన మాంసాహారాన్ని భుజిస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఒకచోట విశ్వామిత్రుని భార్య తన పిల్లలకూ తనకూ తినడానికి తిండిలేక తన ముగ్గురు మగపిల్లలతో మధ్యవాడిని కనీసం నూరు గోవులకు అమ్మాలని ప్రయత్నిస్తుంటే సత్యవ్రతుడు కలసి నమస్కరించి విశ్వామిత్రులవారి గురించి వివరములు అడుగగా ఆమె 'వారు బ్రహ్మర్షి కావాలని పశ్చిమ దిక్కుకు తపస్సుకు వెళ్లారు. నా వద్ద నున్న సంపద అయిపోవడంతో ముగ్గురు పిల్లలను పెంచే శక్తీ లేక, పెద్దవాడు తండ్రికి, చిన్నవాడు తల్లికి ఇష్టులు అవుతారు గాన మధ్యకుమారుని అమ్మాలని భావించాను.. లేకపోతే వీరికి ఆహారం అందించలేకపోతున్నాను' అని దుఃఖిస్తూ చెప్పింది. సత్యవ్రతుడు ఆమెను ఓదార్చి, నేనున్నానని ధైర్యం చెప్పి అడవిలో జంతువులను వేటాడి, తనతో పాటు వారి ఆకలి కూడా తీర్చుతున్నాడు. ఒకరోజు వేటకు వెళితే ఒక్క మృగం కూడా పట్టుబడలేదు. అలా వెదుకుతూ ఉంటే తన రాజ్యంలోని గోవులను మేతకు అడవికి కొంతమంది తీసుకురాగా వారితో తన రాజ్య పరిస్థితులను అడిగి తెలుసుకోవాలని ప్రశ్నించగా వారు సత్యవ్రతుని తండ్రి రాజ్యాన్ని వదలి తపస్సుకు వెళ్లారని, ప్రస్తుతం రాజ్యాన్ని వశిష్టులవారే పాలిస్తున్నారని తెలియజేశారు. దాంతో వశిష్ఠులవారిపై కోపంతో, మేతకు వచ్చిన ఆవులలో వశిష్టులవారి గోవును గుర్తించి, దానిని చంపి, ఆ మాంసాన్ని తాను తిని, తనపై ఆధారపడిన విశ్వామిత్రుని కుటుంబ సభ్యులకు కూడా అందించారు. సత్యవ్రతుడే తన గోవును వధించాడని వశిష్ఠులవారు తెలుసుకుని పిలచి, అతనిని పిలచి, 'నీ ప్రవర్తనతో నీ తల్లి తండ్రులను బాధపెట్టావు. గోవును సంహరించావు, మరియు గోమాంసం భుజించావు. ఈ మూడు శంకలవల్ల నిన్ను లోకం 'త్రిశంకుని' గా పిలుస్తారని శపించాడు. తదుపరి రాజు అయిన తరువాత విశిష్టుని కుమారులచే ఛండాలుడు కమ్మని శపించబడ్డాడు. దాంతో సత్యవ్రతుని దేహం మబ్బు రూపంగా మారింది. ధరించిన వస్త్రం నల్లగా మారింది. అందమైన జుట్టు చింపిరి జుట్టుగా మారింది. ఆభరణాలు ఇనుపముక్కలుగా, యజ్ఞోపవీతం తోలుగా మారిపోయింది. త్రిశంకుని చూసి అంతా దూరంగా ఉంటున్నారు. ఈ సమయంలో విశ్వామిత్రులవారే తనకు రక్షకులని భావించి వెళ్లి వారిని శరణు వేడి విషయం వివరించాడు. విశ్వామిత్రుడు ఆదరించి అభయమిచ్చాడు. ముఖ్యంగా వారు తపస్సులో ఉన్న సమయంలో తన భార్యాపిల్లలు కష్టంలో ఉన్నప్పుడు త్రిశంకుడు ఆదరించి ఆడుకున్నాడని అభిమానం. అందువల్లనే త్రిశంకునితో, 'నీ శాపం తొలగించడం కష్టం. అయితే నిన్ను మాత్రం ఈ శరీరంతోనే స్వర్గానికి పంపుతా' అనడంతో త్రిశంకుడు ఆనందంతో నమస్కరించగా విశ్వామిత్రుడు అతనిని ఆశీర్వదించాడు.

తాను కుమారులను పిలచి నిర్వహించబోయే యజ్ఞ విషయాలు వివరించి, 'ఋషులు, ఋత్విజులు అందరినీ యజ్ఞ ప్రారంభానికి

పిలవండి. ఎవ్వరైనా రానంటే నాకు తెలియజేయండి' అని అన్నాడు. అందరూ వస్తామనే తెలియజేశారు. వశిష్ఠకుమారులు మాత్రం 'యజ్ఞం చేసే అధికారం బ్రహ్మర్షికి తప్ప క్షత్రియునకు లేదు. కర్మ ఛండాలుని ధనంతో బ్రాహ్మణులు భుజించరు. దేవతలు తాము హవిస్సు తీసుకోవడానికి రారు. గాన మేము యజ్ఞంలో పాల్గొనమని తిరస్కరించడంతో విశ్వామిత్రునికి తెలిసి కోపంతో వసిష్ఠ కుమారులను కుక్క మాంసం వండుకు తినే జన్మ ఎత్తి జీవిస్తారని శపించాడు. యజ్ఞానికి వసిష్ఠ కుమారులు తప్ప అంతా హాజరయ్యారు. యజ్ఞ ప్రారంభానికి ముందు విశ్వామిత్రుడు, త్రిశంకుని పరిచయం చేస్తూ 'ఇతడు ఇక్ష్వాకు వంశపు రాజు. యితడు తన శరీరంతో స్వర్గం చేరాలని నన్ను ఆశ్రయించాడు. గాన మీరంతా నాకు త్రిశంకుని కోరిక ఫలించే విధంగా సహకరించాలని' కోరాడు. యజ్ఞం ప్రారంభం అయ్యింది. ఒక్కొక్క దేవతనూ హవిస్సు తీసుకోమని ప్రార్థిస్తుంటే ఎవ్వరూ రావడంలేదు. అప్పుడు విశ్వామిత్రుడు యజ్ఞ విధానాన్ని పక్కన బెట్టి తన తపః శక్తితో యజ్ఞఫలాన్ని ధారపోయగా అందరూ చూస్తుండగానే త్రిశంకుడు శరీరంతో స్వర్గానికి చేరాడు. అక్కడివారు త్రిశంకుని చూసి, 'నీకు గురు శాపముంది. నీకు అసలు స్వర్గానికి అర్హతే లేదు. పైగా ఎవ్వరికీ శరీరంతో స్వర్గం చేరే అర్హత లేదు' అని అంటూ త్రిశంకుని క్రిందకు తోసివేశారు. దాంతో తల క్రిందకి, కాళ్ళు పైకి ఉండే విధంగా క్రింద పడిపోసాగాడు. పడుతూ 'స్వామీ రక్షించండి.. రక్షించండి అంటూ విశ్వామిత్రుని ప్రార్థించగా, విశ్వామిత్రుడు తన తపః శక్తితో ఆకాశంలో అలాగే నిలిపి సప్త ఋషులు, నక్షత్రాలు సృష్టించి, ఇంద్రాది దేవతలను కూడా సృష్టించే ప్రయత్నంలో ఉండగా దేవతలు విశ్వామిత్రుని ప్రార్థించి ఆ ప్రయత్నం నుండి విరమింపజేశారు. ఇంతవరకూ నేను చేసిన సృష్టికి అడ్డు పెట్టవద్దని విశ్వామిత్రుడు దేవతలను కోరగా సరేనని అంగీకరించి దేవతలు స్వర్గానికి వెళ్లిపోయారు.

త్రిశంకుడు మాత్రం అలా ఆకాశంలో తలక్రిందులుగా ఈ సృష్టి అంతం వరకూ తిరుగుతూనే ఉంటాడు. కారణం తల్లితండ్రులను, ఆచార్యులను, భాగవతులను గోవులను జంతువులను హింసించాడు. త్రిశంకుడు కర్మ చండాలుడై కఠిన శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ విషయాన్ని మనం కూడా గుర్తించి నడచుకోవడం శ్రేయస్కరం.

## రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంప వలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి పంపబడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

- సంపాదకురాలు


చైతన్యం సంకల్ప బలం

**చందా రేట్లు**

| | |
|---|---|
| విడిప్రతి | రూ. 20.00 |
| సంవత్సరానికి | రూ. 200.00 |
| పోస్ట్ ద్వారా | రూ. 230.00 |

Please deposit your subscription in favour of
CHAITANYAM SANKALPABALAM
A/c No. 1626201002070- Canara Bank
Kundanbagh Branch, Hyderabad

చందాలు పంపాల్సిన చిరునామా:
చైతన్యం
సామాజిక విలువల మాస పత్రిక
ఫ్లాట్ నంబర్ 45058
జనప్రియ ఉటోపియా
హైదర్ గూడ, అత్తాపూర్
హైదరాబాద్ - 500 048
Email: teegai1@gmail.com
visit: www.chaitanyam.net

# గ్రీసు దేశపు పురాణ గాథలు



## వేమూరి వేంకటేశ్వరరావు

**"Knowledge is acquired when we succeed in fitting a new experience into the system of concepts based upon our old experiences. Understanding comes when we liberate ourselves from the old and so make possible a direct, unmediated contact with the new, the mystery, moment by moment, of our existence."**
**Aldus Huxley. "Knowledge and Understanding"**

## ముందు మాట

నేను ఈ వ్యాసాలు రాయడానికి ప్రేరణ కారణం ఒక విమాన ప్రయాణం. భారత దేశం వెళుతూ, శేన్ ఫ్రాన్సిస్కో లో ఉదయం 8 గంటలకి బయలుదేరి, నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. పరుగుబాట మీదకి దిగడానికి విమానం సంసిద్ధం అవుతూ ఉండగా, "మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం ఉంది. కంట్రోలు టవర్ లో ప్రజలు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి," అని చోదకుడు విమానం జోరు పెంచుతూ పైకి లేచేసరికి ఇహ చేసేది ఏమీ లేకపోవడంతో నా కుర్చీకి ఎదురుగా ఉన్న టి.వి. లో ఏదైనా "ఇరవై నిమిషాల కార్యక్రమం" చూద్దామని వెతకడం ఉపక్రమించేను. "అపస్వరం అనే ఏపిల్ పండు కథ" ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.
పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఈ కథ గురించి వినలేదు. ఆసక్తితో చూసేను. గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ. మా అమ్మాయిని అడిగితే, "చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను" అని చెప్పింది. నేను పుస్తకాల పురుగుని అయినా ఈ కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో అని-పించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ ఉంటే ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటన్నిటిని క్రోడీకరించి వ్యాసాలుగా రాసేను.
ఇక్కడ ఉటంకించిన అంశాలన్నిటినీ కేవలం ఒక నఖచిత్రంలా స్పర్శించినా ఇది పెద్ద గ్రంథం అవుతుంది. అందుకని కొన్ని ముఖ్యమైన అంశాలని మాత్రమే ముచ్చటించేను.

వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజంటన్, కేలిఫోర్నియా

# 4. గ్రీసు దేశపు పురాణ గాథలు: ఒలింపియనులు

ఒలింపస్ పర్వతం గ్రీసు దేశంలో మిక్కిలి ఎత్తయిన పర్వతం (2,918 మీటర్లు ఎత్తు). దాని ఠీవి, దాని రాజసం, దాని అందంతో పాటు అది అందరికి అందుబాటులో లేని కారణంగా ప్రాచీన గ్రీసు దేశస్తులు దానిని దేవతల ఆలవాలంగా ఆరాధించేరు. ఈ పర్వతం మీదనే "టైటన్ మహాసంగ్రామం"లో విజయం సాధించిన ముఖ్యమైన పన్నెండు మంది దేవతలు నివాసమున్నారని ప్రాచీన కాలంలో గ్రీసు దేశస్తులు నమ్మేవారు. ఈ పన్నెండు మందిని "ఒలింపియనులు" అని పిలుస్తారు.

ఈ పన్నెండు మంది ఒలింపియను దేవతలలో --

క్రోనస్ కి రేయాకి పుట్టినవారు ఐదుగురు: జూస్, పొసైడన్, హేరా, డిమిటర్, హెస్టియా.

జూస్ కి హేరా కి పుట్టిన పిల్లలు ఇద్దరు: ఆరీస్, హెఫయెస్టస్.

జూస్ కి ఇతరులతో ఉన్న వివాహేతర సంబంధాల వల్ల పుట్టినవారిలో ఒలింపియను దేవతలుగా లెక్కలోకి వచ్చేవారు నలుగురు: హెర్మీస్, ఎథీనా, ఆర్టెమిస్, అపాలో.

చిట్టచివరగా, యూరెనస్ వృషణాల నుండి పుట్టిన ప్రేమ దేవత ఏఫ్రొడైటి. (పాతాళలోకానికి అధిపతి అయిన హేడీస్ ని ఈ పన్నెండు మందిలో లెక్కించరు.)

## 4.1 జూస్ కొలువులోని ఒలింపియను దేవతల సమాచారం

బొమ్మ: జూస్

జూస్ కొలువులో ఉన్న పన్నెండు మంది ఒలింపియను దేవతలని మరొక సారి మరొక కోణంలో చూద్దాం. కొన్ని కొన్ని పేర్లు దరిదాపు ఒకేలా ఉంటాయి కనుక అన్ని పేర్లని ఇంగ్లీషు వర్ణక్రమంలో కూడా చూపుతున్నాను. ఉత్సాహం ఉన్నవాళ్లు గూగుల్ ఉపయోగించి ఇంకా సమాచారం సేకరించగలరు.

జూస్ (Zeus): (రోమక పురాణాలలో జూపిటర్, Jupiter). క్రోనస్ - రేయాల కొడుకు. దేవతలకి అధిపతి. ఆకాశానికి అధిపతి. ఇతని ఆయుధం మెరుపులు, పిడుగులు. ఒకొక్కసారి ధర్మ నిరతుడు. ఒకొక్కసారి క్రూరంగా ప్రవర్తిస్తాడు. మన ఇంద్రుడి లాంటివాడు; వేద భాషలోని ధౌష్పితృ ( ) కీ, గ్రీకు భాషలోని జూస్ కి, లాటిన్ భాషలోని జూపిటర్ కి మధ్య పోలిక చూడండి. ఋగ్వేదం (1.164.33) ప్రకారం ఇంద్రుడు ద్యయుష్ (ఆకాశం) కి, పృథ్వి (భూదేవి) కి పుట్టిన కొడుకు.

హేరా (Hera): (రోమక పురాణాలలో జూనో, Juno). క్రోనస్ - రేయాల కూతురు. జూస్ చెల్లెలు, పట్టమహిషి. ఈమెలో అసూయ, క్రూరత్వం కనిపిస్తూ ఉంటాయి. భర్తలో ఉన్న పరస్త్రీ వ్యామోహం ఈ లక్షణాలని రెచ్చగొడుతూ ఉంటాయి.

పొసైడన్ (Poseidon): (రోమక పురాణాలలో నెప్ట్యూన్, Neptune). జూస్ తోబుట్టువు; ఒలింపియనులలో జూస్




తరువాత ముఖ్యుడు. సముద్రాలకి అధిపతి. పొసైడన్ కి కోపం వస్తేనే సముద్రంలో తుపానులు వస్తాయని నమ్మేవారు. ఒడీసియస్ మీద దశాబ్దాల పాటు కక్ష పెంచుకున్నాడు.

డిమిటర్ (Demeter): (రోమక పురాణాలలో సీరీస్, Ceres). పాడి పంటలకి అధిపత్ని, క్రోనస్ - రేయాల కూతురు; జూస్ తోబుట్టువు; జూస్ కీ పొసైడన్ కి ప్రియురాలు.

ఎథీనా (Athena): (రోమక పురాణాలలో మినర్వా, Minerva). విద్యలకి అధిపత్ని; జూస్ శిరస్సు నుండి సచేలంగా, సాలంకృతంగా పుట్టింది; ఒడీసియస్ అంటే ఇష్టం; ఆర్టెమిస్, హేస్టియాల వలె నిష్కళంకమైన శీలం;

అపాలో (Appolo): (రోమక పురాణాలలో కూడా అపాలో, Appolo). జూస్ - లేతో లకి పుట్టిన కొడుకు. ఆర్టెమిస్-అపాలోలు కవలలు. సంగీత సాహిత్యాలలో దిట్ట. డెల్ఫైలో ఉన్న ఇతని ఓరకిల్ (గణాచారి) చెప్పే జోశ్యాల మీద అందరికీ ఎక్కువ నమ్మకం. (రెండవ తరం ఒలింపియను.)

ఆర్టెమిస్ (Artemes): (రోమక పురాణాలలో డయానా, Diana.) జూస్ - లేతో లకి పుట్టిన కూతురు. ఆర్టెమిస్-అపాలోలు కవలలు. ఎతినా వలె కాసింత మగరాయుడు. ఈమె మృగయావినోదాలకి అధిపత్ని. మంచి అందగత్తె.



(రెండవ తరం ఒలింపియను.)

ఆరీస్ (Ares): (రోమక పురాణాలలో మార్స్ , Mars) యుద్ధ విద్యలకి అధిపతి; జూస్ - హేరా లకి పుట్టిన కొడుకు; రక్తపిపాస మెండు;

ఏఫ్రొడీటి (Aphrodite): (రోమక పురాణాలలో వీనస్, Venus) లైంగిక ప్రేమకి అధిపత్ని ; యూరెనస్ జననాంగాలని కోసి సముద్రంలో పారేసినప్పుడు వాటి నుండి స్రవించిన తెల్లటి నురుగు నుండి పుట్టిన వ్యక్తి అని ఒక కథనం ఉంది. ట్రోయ్ లో జరిగిన యుద్ధానికి ప్రేరణ కారకులలో ఈమె ఒకరు. అందాలు చిందే ఏఫ్రొడైటి కురూపి, అవిటి అయిన హెఫయెస్టస్ ని పెళ్లి చేసు కోవడం కాసింత ఆశ్చర్యం కలిగించే విషయం. (టైటనుల తరానికి చెందిన ఒలింపియను);



హెర్మీస్ (Hermes): (రోమక పురాణాలలో మెర్క్యురీ, Mercury) కృత్తిక కన్యలలో ఒకరు, ఏట్లస్ కూతురు అయిన మాయియా (Maia) కీ జూస్ కి పుట్టిన కొడుకు. దేవ దూత; బహుముఖ ప్రజ్ఞావంతుడు; దేవతల వార్తావాహకుడు. చెలగాటాలు ఆడడంలో దిట్ట. వీణ లాంటి వాయిద్యాన్ని పట్టుకుని విశ్వ పర్యటన చేస్తూ ఇక్కడి వార్తలు అక్కడకి చేర్చుతూ



ఉంటాడు. ఈ కోణంలో హెర్మీస్ కి మన నారదుడికి పోలిక కనిపిస్తుంది. హెర్మీస్ కొడుకు ఒకడు నరమేషం (సగం మనిషి, సగం మేక) లా పుడతాడు. హెర్మీస్ కి ఏఫ్రొడీటికి పుట్టిన కొడుకు హెర్మేఫ్రొడీటస్ అర్ధనారి - అనగా ఒకే శరీరంలో అడా, మగా ఉన్న స్వరూపం. మరణించిన వారి ఆత్మలని దగ్గర ఉండి, చెయ్యి పట్టుకుని అధో (యమ) లోకానికి తీసుకెళతాడు.

హెఫయెస్టస్ (Hephaestus): (రోమక పురాణాలలో వల్కన్ , Vulcan) అగ్ని దేవుడు, దేవతల కమ్మరి; కురూపి; అందాలరాసి ఏఫ్రొడైటిని పెళ్లి చేసుకున్నాడు; హేరాకి కొడుకు; తండ్రి ఎవ్వరో తెలియదు (జూస్ కావచ్చు).

హేస్టియా (Hestia) కానీ డయనీసస్ (Dionysus) కానీ: క్రోనస్ కి రేయాకి పుట్టిన ప్రథమ సంతానం హేస్టియా. జూస్, పోసైడన్, డిమిటర్, హేరా ల సోదరి. అపాలో, పొసైడన్ ఇద్దరూ ఈమె కోసం పోట్లాడుకుంటూ ఉంటే వారి పోట్లాటని ఆపడానికి జీవితాంతం కన్యగా ఉండిపోతానని ప్రతిన పూనుతుంది. దీనికి ప్రతిఫలంగా పూజలన్నిటిలోను ప్రథమ తాంబూలం ఇవ్వాలని జూస్ ఈమెకి "వరం" ఇచ్చేడు.

జూస్ కీ మానవ వనితకు పుట్టిన బిడ్డ కనుక డయనీసస్ సంపూర్ణ దైవత్వం లేని వ్యక్తి (demigod) కనుక ద్వాదశ ఒలింపియనుల జాబితాలో ఇమడక పోవచ్చు.

ఒలింపస్ పర్వతం మీద నివాసం ఉండే ఈ మూడవ తరం దేవతలలో జూస్ - హేరా ల సంతానమే ఎక్కువమంది!

4.2 గ్రీసు పురాణ పాత్రల వంశవృక్షం

ముఖ్యమైన పాత్రల వంశవృక్షం, టూకీగా -

మొదటి తరం:

యూరెనస్ కీ గాయా కీ → క్రోనస్, రేయా, థెమిస్ (పెద్ద)

రెండవ తరం (టైటనులు):

క్రోనస్ కి రేయా కీ →జూస్, హేరా, పొసైడన్, హేడిస్, డిమిటర్, హేస్టియా

మూడవ తరం (ఒలింపియనులు)

జూస్ కి హేరా కీ → ఆరీస్, హెఫయెస్టస్ (లేదా, హేరా →హెఫయెస్టస్?)

జూస్ కి మేటిస్ కీ →ఎథీనా

జూస్ కి లేతో కీ →అపాలో, ఆర్టిమిస్

జూస్ కి మయియా కీ →హెర్మీస్

జూస్ కి సెమిలీ కీ →డయనీసస్

జూస్ కి డయోన్ కీ → ఏఫ్రొడీటి? లేదా యూరెనస్ వృషణాల నుండి →ఏఫ్రొడీటి? (లేదా, జూస్ కి డయోన్ కీ →ఏఫ్రొడీటి?)

జూస్ కి ఇతరులతో → పెర్సిఫొనీ, పెర్సియస్, హెరాక్లిస్, ట్రోయ్ కి చెందిన హెలెన్, మినోస్, కాకుండా తొమ్మిది మంది మూజ్ లు. (ఈ మూజ్ లు కళలకి, విద్యలకి అధిపత్నులు.)

హేడీస్ (Hades): క్రోనస్ - రేయా ల కొడుకు. జూస్, పోసైడన్, డిమిటర్, హేరా, హేస్టియా ల సోదరుడు. క్రోనస్ ని పదవీ భ్రష్టుడిని చేసేక క్రోనస్ రాజ్యం ముక్కలైపోయింది. పాతాళం హేడీస్ కి దక్కింది. అప్పుడు హేడీస్ తన



రాణి పెర్సిఫోనితో గద్దె కెక్కి మరణించిన ఆత్మలపై అధోలోకంలో పాలన సాగించేడు. ఈ పరిపాలనలో సెర్బరస్ అనే మూడు తలల కుక్క అతనికి సహాయపడింది.

థేమిస్: క్రోనస్-రేయా ల పుత్రిక. ఈమె ధర్మపరిపాలనకి అధినేత్రి. ఈమె కుడి చేతిలో దుష్ట శిక్షణకి ఒక కత్తి, ఎడమ చేతిలో నిష్పక్షపాత ధర్మపాలనకి గురుతుగా ఒక త్రాసు ఉంటాయి. ఈమె కళ్ళకి కట్టిన గుడ్డ తీర్పు కొరకు వచ్చిన ప్రత్యర్థుల సాంఘిక స్థాయికి అతీతంగా ఆమె తీర్పు ఉంటుందని సూచిస్తుంది. జూస్ అంతటివాడు తనకి వచ్చిన ధర్మసందేహాలని తీర్చుకుందుకి ఈమెని సంప్రదిస్తూ ఉంటాడు.

గ్రీసు చరిత్రలో మరొక థేమిస్ ఉంది ఈ “పెద్ద” థేమిస్ యూరెనస్-గాయా ల కూతురు. ఈమెకి భవిష్యత్తు లోకి చూడగలిగే శక్తి ఉంది. ఈ శక్తిని ఆమె తన పెరింటిగత్తె అయిన "చిన్న" థేమిస్ కి ధారపోసిందని ఒక





ఐతిహ్యం ఉంది.


**4.3 గ్రీసు పురాణ కథలపై ఒక వ్యాఖ్య**

గ్రీసు పురాణ కథలు అన్నీ కేవలం పుక్కిటి పురాణ గాథలని మనకి ఇప్పుడు తెలుసు. కానీ మనకి ఈ రోజులలో రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, జీసస్, మహమ్మద్, వగైరాలు ఎటువంటి “చారిత్రక” వ్యక్తులో ఆ కాలంలో ప్రజలకి ఒలింపియను దేవతలు కూడా “చారిత్రక” వ్యక్తులే! కానీ కాలక్రమేణా ఇవి మానవులకి నీతులు నేర్పే పురాణ కథలుగా పరిగణన చెందడం మొదలయింది.

విమర్శకులకు గ్రీసు దేశపు పురాణ కథలలో తరచు మానవ జీవితాలలో దేవతలు తల దూర్చి మానవులని ఆటలలో పావులులా ఉపయోగించుకుంటున్నట్లు కనిపించవచ్చు. లేదా, ఆశా దృక్పథంతో చూసేవారికి గర్వమదాంధకారంతో ప్రవర్తించడం వల్ల కలిగే నష్టం ఎలా ఉంటుందో చూపించే నీతి కథలా ఉండొచ్చు. ఎప్పుడైనా ఒక మనిషి కానీ, ఒక చిల్లర దేవత కానీ తన కంటే పై మెట్టులో ఉన్న దేవతతో సమాన ఉజ్జీనని విర్రవీగడడం మొదలు పెడితే ఆ వ్యక్తి తక్షణం శిక్ష అనుభవించడం మనం తరచు చూస్తాం.

(ఇంకా వుంది)

# ప్రేమంటే ఇంతే



(గతసంచిక తరువాయి)

ఇంద్రగంటి వేంకట సుబ్బారావు

మనము ఇద్దరూ ఒకరినొకరు ఇష్టపడ్డాము, అభిమానించుకున్నాము, ప్రేమించుకున్నాము అలాగే మన తల్లితండ్రులకి, మన తోడబుట్టినవారికి మన పట్ల ప్రేమాభిమానాలు మనం ప్రేమించుకోక ముందు నుంచి, నిజానికి మనం పుట్టిన దగ్గరనుండి మన మీద వున్నాయి. అయితే మనిషికి వయసుతో బాటు ఆలోచనా శక్తి పెరిగి స్వతంత్రంగా ఆలోచిస్తాడు, అందుకని మన పెళ్ళి విషయమనే కాదు, మన పెద్దలు కొన్ని విషయాలలో తీసుకునే నిర్ణయాలతో మనం విభేదిస్తాము, అంతమాత్రాన వారితో తెగతెంపులు చేసుకోము కదా? కొన్నిసార్లు వారు మన అభిప్రాయాలని మన్నిస్తారు, కొన్నిసార్లు మనం వారి అభిప్రాయలని గౌరవించాలి లేదా తల ఒగ్గాలి, రాజీ పడాలి తప్పదు'. దురదృష్టవశాత్తు మన పెళ్ళి విషయంలో మనం రాజీ పడవలసి వస్తున్నాది. ఒక విషయం గుర్తు పెట్టుకో 'భవిష్యత్తులో మనం కలుసుకున్నా లేకున్నా, ఎక్కడ వున్నా నా మనసులో నీకు, నీ మనసులో నాకు వున్న స్థానాలు పదిలంగా వుంటాయి, అవి శాశ్వతం దానిని ఎవ్వరు ఏమీ చేయలేరు'.

"మనకి ఆ రాధాకృష్ణుల పేర్లు పెట్టినందుకు వాళ్ళ మాదిరిగానే ప్రేమికులుగానే మిగిలిపోతున్నాము...మన ప్రేమ ఓడిపోయింది బావా"

"రాధా ప్రేమలో ఓటమి, గెలుపు అన్నవి వుండవు, ఎందుకంటే అది ఆట కాదు, అనుభూతి, ఆ అనుభూతి అనిర్వచనీయము, అచంచలము. రాధాకృష్ణుల ప్రేమ నిజమైనది, పవిత్రమైనది అందుకే ప్రేమ గురించి మాట్లాడేటపుడు రాధాకృష్ణులనే ఉదహరిస్తారు. ప్రేమికులు రోజూ సంభాషించుకోవలసిన అవసరం లేదు, ఎల్ల వేళలా కలిసి వుండనక్కరలేదు. వాళ్ళ హృదయాలలో ఆ బంధం వున్నంతకాలం వారు ఎప్పుడూ విడిపోరు"

"బావా ఆ కృష్ణుడి పేరు పెట్టినందుకు నీకు ఎవరిని ఎలా నచ్చజెపాలో, ఎలా ఒప్పించాలో బాగా అలవడింది. నీ మాటకారితనంతో ఎవరినైనా ఇట్టే ఒప్పిస్తావు"

"సరే పద, ఏడ్చి ఏడ్చి నీరసం వచ్చి వుంటుంది, ముందు భోజనం చేద్దాము, లేకపోతే నీరసం మీద కళ్ళు తిరుగుతాయి"

"బావా ఇవాళ అంతా ఇలాగే కూర్చుని నీతో గడపాలని వుంది. సరే భోజనం చేసాక నన్ను సినిమాకి తీసుకు వెళ్ళు"

"వద్దు, నీ పెళ్ళికి ముహూర్తం కూడా పెట్టారు, ఈ సమయంలో మనలని ఎవరైనా చూస్తే అది నీకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది"

"కృష్ణా నువ్వు అన్నట్లు జీవితంలో మళ్ళీ ఎప్పుడు కలుస్తామో, అసలు కలుస్తామో లేదో తెలియదు. అందుకని బావా ఈ రోజు నీతో సంతోషంగా గడపనీ, ఆ మధురమైన అనుభూతి నాకు మిగలనీ. ప్లీజ్, నిన్ను ఇంకెప్పుడు ఏదీ అడగను కాదనకు" ఆమె అతని చేతులు పట్టుకుని దీనంగా అభ్యర్థించింది.

ఆమె అలా దీనంగా అభ్యర్థించేసరికి కృష్ణమోహన్ కాదనలేకపోయాడు.


"సరే ముందు నువ్వు మామూలుగా వుండి చీర్ఫుల్గా వుండాలి, అలాగయితేనే తీసుకు వెళతాను"

"అలాగే బావా"

ఇద్దరు బయలుదేరి కోఠీలో వున్న కామత్ హోటల్కి వచ్చి కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేసారు.

కృష్ణమోహన్ కావాలనే ప్రకాష్ ప్రస్తావన తెచ్చి అతని గురించి, అతని కుటుంబం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. అలా చెయ్యడం వలన అనూరాధకి తన భవిష్యత్తు పట్ల

ఆందోళన తగ్గి, బెంగ పోయి సౌకర్యంగా వుంటుందని అని అతని నమ్మకం.
"బావా నువ్వు నా పెళ్ళికి తప్పకుండా రావాలి"
"రాధా మీ నాన్నగారికి నేను రావడం ఇష్టం వుండకపోవచ్చు, నా రాక వల్ల అక్కడ అనవసరమైన ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయని నన్ను పిలవకపోవచ్చు, ఎందుకులే అనవసరంగా ఆయనని ఇబ్బంది పెట్టడం ఆ సంగతి వదిలెయ్యి"
"నిన్ను పిలవడం గురించి ఇంట్లో ఇప్పటికే చర్చ జరిగింది. నాన్నగారు వద్దు అతను వచ్చి ఇక్కడ గలాటా చేస్తాడు అన్నారు. అయితే అన్నయ్యలిద్దరూ మోహన్ అలాంటి పనులు చేసే దుర్మార్గుడిలా, కుసంస్కారిలా మీకు కనబడుతున్నాడా? అసలు మనం అతనికి చేసిన అన్యాయం గురించి సిగ్గు పడాలి, అతనిని మేము పిలుస్తాము, ఇంక మీరు ఏమీ అడ్డు చెప్పకండి అని తెగేసి చెప్పారు, అమ్మ కూడా అన్నయ్యలని సమర్థించింది. అన్నయ్యలిద్దరు నిన్ను పిలుస్తామని నాకు చెప్పారు"
"సరే లే చూద్దాము"
"చూద్దాము కాదు...అసలు సంగతి మరచిపోయాను. నువ్వు నాకు మూడు విషయాలు మీద వాగ్దానం చెయ్యాలి. ఒకటి నా పెళ్ళికి తప్పకుండా రావాలి, రెండు నా పెళ్ళి తరువాత నువ్వు నన్నే తలచుకుంటూ దేవదాసులా మారకూడదు, నాకంటే అందగత్తె అయిన మంచి కోనసీమ అమ్మాయిని



పెళ్ళి చేసుకోవాలి, మూడు ఈ రోజు నుండి జీవితంలో ఎప్పుడూ డ్రింక్ చెయ్యనని నా చేతిలో చెయ్యి వేసి చెప్పు బావా"
"అలాగేలే"
"ఊరికే అలాగే అంటే కాదు, నా చేతిలో చెయ్యి వేసి చెప్పు"
"రాధా ముందరి కాళ్ళకి బంధం వేస్తున్నావు. సరే నీ పెళ్ళికి పిలిస్తే తప్పకుండా వస్తాను, నా పెళ్ళి సంగతి గురించి ప్రస్తుతానికి నేను ఆలోచించను, కొంత కాలం పోయాక చూద్దాము. ఇక డ్రింక్స్ విషయం నేను నీకు గతంలో కూడా చెప్పాను డ్రింక్స్ అంటే నాకు ఆశక్తి లేదని, నీ కోసం తప్పకుండా మానేస్తాను, కాని ఈ రోజు నుండి కాదు, నీ పెళ్ళి జరిగిన మర్నాటి నుండి మానేస్తాను సరేనా" అని అనూరాధ చేతిలో చెయ్యి వేసి చెప్పాడు కృష్ణమోహన్.
"అదేమిటి, ఆ గడువు ఎందుకు?"
"అదంతే కారణం అడగద్దు, మానేస్తాను అని మాట ఇచ్చాను కదా, నీకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాను"
"థాంక్యూ బావా, మన ఇన్నాళ్ళ కలయికలో ఎప్పుడైనా నీ మనసు నొప్పించి వుంటే నన్ను మన్నించు. నీకు అన్యాయం చేసి ఉంకొక వ్యక్తితో పెళ్ళి చేసుకుంటున్నందుకు నన్ను క్షమించు బావా"
"ఏయ్ రాధ ఏమిటిది? ఇలాంటి మాటలు మాట్లాడి నన్ను పరాయివాడిని చెయ్యకు. సరే నువ్వు కూడా నాకు ఒక మాట ఇయ్యాలి" అన్నాడు చెయ్యి చాపి.
"ఏమిటది"
"పెళ్ళి అయిన తరువాత గతం గుర్తు చేసుకొని బాధ పడకుండా ప్రకాష్తో సంతోషంగా వుంటానని నాకు మాట ఇయ్యి. ఎందుకంటే అతను తన దాంపత్య జీవితం గురించి ఎన్నో కలలు కంటూ ఆతృతతో ఎదురు చూస్తూ వుంటాడు"
"బావా నీ మాట నాకు శాసనమని ఏనాడో చెప్పాను, తప్పకుండా అతనికి భార్యగా నా బాధ్యతలని, నా ధర్మాన్ని నిర్వర్తిస్తాను"
"ఇప్పుడు నాకు చాలా సంతోషంగా వుంది, రాధ మంచి పిల్ల" అని ఇదిగో నీ చాక్లెట్స్ అని ఇచ్చాడు.
"థ్యాంక్యూ బావా, మళ్ళీ ఎన్నాళ్ళకి నీ చాక్లెట్స్ తింటానో... నీ అభిమాన హీరో అక్కినేని నటించిన ఆలుమగలు సినిమాకి వెళదాము"
"వద్దు రాధ మనం ఆలుమగలు కాలేకపోతున్నాము కనుక ఆ సినిమాకి వద్దు, నారాయణగూడ శాంతి థియేటర్లో జీవితనౌక

సినిమాకి వెళదాము. అందులో నీ అభిమాన హీరో శోభనబాబు వున్నాడు, మనిద్దరి అభిమాన దర్శకుడు విశ్వనాథ్ గారి సినిమా అది"...'ఆలుమగలు' పదం అన్నపుడు కొంత ఉద్వేగానికి గురి అయ్యాడు కృష్ణమోహన్. అయితే అతను తన ఉద్వేగాన్ని ఎంత దాచుకోవడానికి ప్రయత్నించినా అనూరాధ పసిగట్టింది.

"అలాగే బావా నీ ఇష్టమే నా ఇష్టం"

సినిమా చూస్తున్నంతసేపు అనూరాధ కృష్ణమోహన్ భుజం మీద తల వాల్చి అతని చెయ్యి గట్టిగా పట్టుకుని కూర్చుంది.

సినిమా అయినాక "బావా ఒక్క పది నిముషాలు దగ్గరలో వున్న బర్కత్పుర పార్క్లో కూర్చుని రిలాక్స్ అయి, చిక్కడపల్లిలో మిరపకాయ బజ్జీలు తిని సుధా హోటల్లో కాఫీ త్రాగి మనం వెళ్ళి పోదాము" అంది అనూరాధ.

ఆనూరాధ ఈ రోజు సాధ్యమైనంతసేపు తనతో గడపాలని అనుకుంటున్నాది అని కృష్ణమోహన్కి అర్ధమయ్యింది, ఆమెని నిరుత్సాహపరచడం ఇష్టం లేక "సరే" అన్నాడు.

పార్క్కి వెళ్ళాక "వీలైనంత తొందరగా పెళ్ళి చేసుకో బావా, నువ్వు పెళ్ళి చేసుకొని స్థిరపడేదాక నా పరితాపము తగ్గదు. నువ్వు కూడా ఒక ఇంటివాడివి అయితేనే నా మనసుకి శాంతి లభిస్తుంది, అంతవరకు నీకు అన్యాయం చేసేనన్న భావన నన్ను దహించివేస్తుంది"

"అలాగేలే, అనవసరంగా ఆలోచించి నీ జీవితాన్ని ధుర్భరం చేసుకోవద్దు"

సుధా హోటల్లో ఫేమలీ రూంలో కూర్చుని కాఫీ త్రాగి "ఇక బయలుదేరుదాము" అని కృష్ణమోహన్ లేచి నిలబడ్డాడు. అనూరాధ కూడా లేచి హటాత్తుగా అతనిని గట్టిగా కౌగిలించుకొని అతని గుండెల మీద చుంబించింది. కృష్ణమోహన్ కూడా ఆమెని తన కౌగిలిలోకి తీసుకొని నుదిటి మీద ముద్దు పెట్టుకున్నాడు.

అనూరాధ కన్నీళ్ళతో కృష్ణమోహన్ గుండెల దగ్గర షర్ట్ తడిసింది, కృష్ణమోహన్ కన్నీళ్ళు ఆమె నుదిటిని తడిపి ఆమె కన్నీటితో సంగమించింది. అనూరాధని ఇంటి దగ్గర వరకు దిగబెట్టాడు కృష్ణమోహన్.

రెండు రోజుల తరువాత రాజేశ్వరరావు, రవి కృష్ణమోహన్ రూముకి వెళ్ళి అనూరాధ పెళ్ళికి రమ్మని ఆహ్వానించారు. అనూరాధ పెళ్ళికి అవినాశ్తో కలిసి వెళ్ళాడు కృష్ణమోహన్, సత్యనారాయణ, వైదేహి పెళ్ళికి వచ్చారు.

అనూరాధ కోసం కొన్న బంగారు గాజులు తన అక్కయ్యకి ఇచ్చి అనూరాధ చేతికి తొడగమని చెప్పాడు. అనూరాధ పార్వతమ్మగారు ఇద్దరే వున్నపుడు వైదేహి ఆ గాజులు అనూరాధ చేతికి తొడిగి కృష్ణమోహన్ ఇచ్చిన కానుక అని చెప్పింది. పెళ్ళి కార్యక్రమం పూర్తి అయిన తరువాత భోజనాలు చేసి విశ్వనాధంగారిని, మిగతా కుటుంబ సభ్యులందరిని, సత్యనారాయణ, వైదేహిని కలిసి వెళ్ళొస్తామని చెప్పాడు కృష్ణమోహన్.

ఆఖరున అనూరాధని కలిసి "వెళ్ళొస్తాను రాధ" అన్నాడు.

"అద్భుతమైన కానుక ఇచ్చావు థాంక్యూ బావా. నాకిచ్చిన మాట గుర్తుందిగా? తొందరలో నిన్ను పెళ్ళికొడుకుగా చూడాలి" అంది అనూరాధ.

"నీకిచ్చిన మాట తప్పక నిలబెట్టుకుంటాను"

ఇంతలో ప్రకాష్ అక్కడికి వచ్చాడు అతనిని కృష్ణమోహన్, అవినాశ్లకి పరిచయం చేసింది అనూరాధ. కాస్సేపు మాట్లాడుకున్న తరువాత "ప్రకాష్, రాధా మీ వైవాహిక జీవితం ఆనందంగా, సౌభాగ్యవంతంగా నూరేళ్ళు సాగాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతుని కోరుకుంటున్నాను" అని అక్కడ నుండి బయలుదేరారు అవినాశ్, కృష్ణమోహన్.

నలభై రెండవ భాగం

కారు హారన్ విన్న అవినాశ్ వర్తమానంలోకి వచ్చాడు.

అవినాశ్ ఇంటికి చేరుతూనే రుక్మిణి ఒక్క అంగలో కారు దిగి గాభరాగా ఇంట్లోకి వెళ్ళింది. ఎదురుగా వచ్చిన అవినాశ్ని "ఆయన ఎలా వున్నారు అన్నయ్యా?" అని అడిగింది.

"మీ ఆయనకేం అమ్మా, అదిగో శేషపానుపు మీద విష్ణుమూర్తిలా ఎలా పడుకున్నాడో చూడు" అని సోఫాలో పడుకున్న కృష్ణమోహన్ని చూపించాడు.

ఈ లోపల కారు పార్క్ చేసి వచ్చిన మురళి సోఫాలో పడుకున్న కృష్ణమోహన్ని చూసి "ఏమైంది అన్నయ్యకి, అలా పడుకున్నాడు" అని కంగారుగా

అవినాశ్ని అడిగాడు.

"కంగారు పడకు, కొంచెం అప్సెట్ అయ్యాడు, రిలాక్స్ అవుతున్నాడు, కొద్ది సేపటిలో లేస్తాడు" అని రుక్మిణి ప్రక్క తిరిగి "చూడమ్మా, బావ లేచిన తరువాత అతనిని నియత్రించడం నా వల్ల కాదు, ఆ బాధ్యత నీదే. నువ్వు కాస్సేపు సత్యభామగా మారి ఈ శ్రీకృష్ణుడి సంగతి చూడు" అన్నాడు అవినాశ్.

మురళికి అసలు ఏం జరుగుతున్నాదో అర్ధం కావడం లేదు. అన్నయ్యని వదిన నియత్రించడం ఏమిటి? అన్నయ్య ఏం చేసాడు? అన్నయ్య అప్సెట్ అవడానికి కారణం ఏమిటి? ఏమిటి ఇదంతా?...ఇక ఆ ఉత్కంఠ భరించలేక "బాస్! అసలేం జరిగింది నాకంతా గందరగోళంగా వుంది" అని అవినాశ్ని అడిగాడు.

అవినాశ్ జరిగినది ఎక్కడ చెబుతాడో అని రుక్మిణి కలుగ చేసుకొని "మీ అన్నయ్య లేచాక అన్ని విషయాలూ చెబుతారు" అంది. మురళికి విషయం తెలియడం రుక్మిణికి ఇష్టం లేదు అందుకే అన్నయ్య పేరు చెప్పి మురళిని ఊరుకో బెట్టిందని అవినాశ్ గ్రహించాడు. ఇంతలో కృష్ణమోహన్ అటు ఇటు కదిలి లేచాడు. లేస్తూనే ఎదురుగా రుక్మిణి కనిపించడంతో, నేను ఇంటికి ఎలా వచ్చాను అనుకున్నాడు. తరువాత మురళి, అవినాశ్ కనబడ్డారు, చుట్టూ కలయ చూసి అవినాశ్ ఇంట్లోనే వున్నాను అనుకున్నాడు. "బావా వీళ్ళెప్పుడు వచ్చారు?" అని అవినాశ్ని అడిగాడు. ఎందుకో రుక్మిణిని నేరుగా అడగటానికి మొహమాటం వేసింది.

"నేనే రమ్మన్నాను" అని ముక్తసరిగా చెప్పాడు అవినాశ్.

"అవన్నీ తరువాత మాట్లాడుకుందాము, సమయం పదకొండు దాటింది, ముందు మీరిద్దరూ భోజనం చేయండి" అంటూ రెండు కంచాలు డైనింగ్ టేబుల్ మీద వేసి వడ్డన మొదలుపెట్టింది రుక్మిణి.

తనకి విషయం తెలియనీయకుండా వదినగారు ఎందుకో విషయాన్ని దాటవేస్తున్నాదన్న సంగతి మురళికి అర్ధం అయింది. ఇలాంటి సమయంలో విషయం తెలుసుకోకుండా వుండటమే సబబు అనిపించి, ఇక ఆ విషయం ఎత్తకూడదు అనుకున్నాడు. భోజనాలు చేస్తున్నంతసేపు ఎవరూ ఏమి మాట్లాడలేదు, కాని రుక్మిణి మౌనాన్ని కృష్ణమోహన్ భరించలేక పోతున్నాడు. రుక్మిణికి జరిగినదంతా తెలిసిందన్న సంగంతి అతనికి అర్ధమయింది, అందుకే రుక్మిణితో మాట్లాడడానికి ఇబ్బంది పడుతున్నాడు.

భోజనాలయిన తరువాత "మురళీ నువ్వు అన్నయ్య స్కూటర్ తీసుకొని బయలుదేరు, అన్నయ్య వదిన కారులో వస్తారు. నువ్వు నేరుగా పెళ్ళివారింటికి వెళ్ళు, వాళ్ళిద్దరు ఇంటికి వెళ్ళి కాస్త రిలాక్స్ అయి ఉదయం ఆరున్నర కల్లా పెళ్ళివారి ఇంటికి వస్తారు" అన్నాడు అవినాశ్. అలా పంపడం వల్ల మోహన్ రుక్మిణిలకి ఏకాంతాన్ని కలుగచేసి, వాళ్ళిద్దరూ మనసు విప్పి మాట్లాడుకోవడానికి అవకాశం కల్పించాడు అవినాశ్.

మురళి వెళ్ళిన తరువాత "నన్ను మన్నించు బావా! నీ పరిస్థితి చూసి నాకు చాలా ఆందోళన, భయం కలిగింది. అందుకే మా చెల్లెలుకి ఫోన్ చేసి రప్పించాను. నీకు తెలివి వచ్చిన తరువాత నిన్ను డ్రింక్ చేయకుండా నేను ఆపలేను, ఎందుకంటే అరగంట తరువాత నీ నిర్ణయమే నా నిర్ణయమని మాటిచ్చాను, అందుకే నాకు ఇంత కంటే వేరే మార్గం కనబడలేదు" అన్నాడు అవినాశ్.

"అంటే నేను నీకు లొంగనని భయపడి, మీ చెల్లెలిని చూపెట్టి నన్ను భయపెట్టి లొంగదీసుకున్నావా బావా" అంటూ జోక్ చేసాడు కృష్ణ మోహన్.

"మా అన్నయ్య అమాయకుడు గనుక నన్ను చూసి మీరేదో భయపడతారు అని అనుకున్నాడు ...ఇంతకీ రాధ, రుక్మిణిలతో సరా! లేదా సత్యభామ ఎంట్రీ కూడా వుందా?" అని నవ్వుతూ రుక్మిణి చమత్కరించింది.

హమ్మయ్య! వీళ్ళిద్దరూ మామూలుగా నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు అని మనసులో అనుకొని రిలాక్స్ అయ్యాడు అవినాశ్.

"ఆనువుగాని చోట అధికులమనరాదు అన్నారు ఇక్కడ మెజార్టీ మీది, అందుచేతనో కామెంట్స్" అన్నాడు కృష్ణమోహన్.

(ఇంకా వుంది)

# భయం

పాలకుర్తి రామమూర్తి



భయం అంటే ఏమిటి? మనసులో కలిగే ఒక భావోద్వేగ ప్రక్రియ. అది ఎందుకు కలుగుతుంది? ఏదో జరుగబోతుందనే భావనలో నుండి కలుగుతుంది. అంటే అప్పటి దాక జరగని ఏదో ఇక ముందు జరుగుతుందనే అనుమానమే భయం. అనుకున్న కాలేజీలో సీటు వస్తుందా? అనుకున్న సబ్జెక్ట్ లో సీటు వస్తుందా? కోరుకున్న ఉద్యోగం వస్తుందా? పెట్టిన వ్యాపారం ఫలప్రదమౌతుందా? చేస్తున్న ఉద్యోగంలో ఉన్నతి లభిస్తుందా? కోరుకున్న లక్షణాలు కలిగిన జీవిత భాగస్వామి లభిస్తుందా? ఇవన్నీ భయానికి మూలాలే. నిజానికి లేనిదాని గురించి మాత్రమే మనలో భయం ఉత్పన్నమౌతుంది. అంటే మనసు మన అదుపులో లేకుండా మరొక దాని ప్రభావానికి గురైనదనే అనుకోవాలి.

ఒకటి కావాలనుకున్నాము... అది లభించలేదు... దానితో అది దొరకదేమో అనుకున్న సమయంలో మనసులో కలిగే అలజడి... భయం. మన అర్హతను పట్టించుకోకుండా ఒక అమ్మాయిని/ అబ్బాయిని ప్రేమిస్తాము... మన ప్రేమ యదార్థమయ్యే పరిస్థితులు మృగ్యమైపోతున్న సంకేతాలు వస్తున్నప్పుడు మనలో కలిగే మానసిక వైకల్యమే భయం. దాని నుండి కోపం వస్తుంది... కోపం క్రోధానికి దారి తీస్తుంది. భయం ప్రతిక్రియకు(Reaction) దారి చూపుతుంది.

భయం.. భయం ఈ భూమిపై ఉన్న అన్ని జీవరాసులలో సాధారణమైన ప్రతిస్పందన. ప్రతి నిత్యం ప్రతి వ్యక్తీ తీసుకునే ప్రతి శ్వాసా అతనిని మరణానికి దగ్గరగా తీసుకు వెళ్ళుతున్నదనే విషయం అందరికీ అవగాహనలో ఉన్నదే. మృత్యువు కన్నా జీవులను భయపెట్టేదేదీ లేదనే విషయమూ తెలిసిందే.. అయినా భయపడాల్సిన పరిస్థితు లెదురైనప్పుడు భయపడడం సాధారణంగా జరిగేదే. ఒకవిధంగా చూస్తే భయం యొక్క ఉనికిని గుర్తించక పోవడం కూడా పిరికితనమే అవుతుంది. జీవితంలో ఎదురయ్యే ప్రమాదాలను ఎదుర్కొనే సమయంలో భయమే జాగ్రత్తలను నేర్పుతుంది. ఆ పరిస్థితుల నెదురుక్కునే మానసిక శారీరక సంసిద్ధతను లేదా సన్నద్ధతను పొందేందుకు భయమే సహాయకారిగా ఉంటుంది. ఈప్రపంచంలో కొన్ని విషయాలను మనం మార్చలేమనే విషయం అవగాహన చేసుకొని దానికి తగ్గ రీతిలో మన జీవితాలను మలచుకోవడం తద్వారా సంతృప్తిగా ఉండగలగడం భయం వల్లనే కదా సాధ్యపడుతుంది.

భగవద్గీత పదునాలగవ అధ్యాయంలో మొదటి మూడు శ్లోకాలు ఇరవై ఆరు దైవీ గుణములను ప్రస్తావిస్తున్నాయి. అందులో ప్రముఖంగానే కాక మొదటగా పేర్కొన్నది భయరాహిత్యం లేదా నిర్భయత గూర్చి. ప్రపంచంలో ఏ వ్యక్తి యైనా దుర్గుణముల పాలబడ్డాడంటే దానికి మూలం అతనిలో ఏ మూలో పొడచూపిన భయము. ఈ భయం నుండే అన్ని దుర్గుణాలూ బయట పడతాయి. "అభయం

పై జనక ప్రాప్తోఽసి" అంటున్నాయి ఉపనిషత్తులు. భయ రహిత స్థితి సాక్షాత్తూ బ్రహ్మ పదముగానే వర్ణిస్తాయి ఉపనిషత్తులు. ఈ సృష్టిలో జరిగే ప్రతి సంఘటన లేదా తన కెదురైన ప్రతి సన్నివేశం ప్రతి వ్యక్తీ తాను వినియోగించు కునేందుకు లేదా ఆనందించేందుకు ఉద్దేశింపబడిందే అయినా విజ్ఞులైనా, అజ్ఞులైనా చాలామంది దానిని గుర్తించరు. ఈ సృష్టిలో ప్రతిదీ నిజానికి భగవంతుని అంశయే... వ్యక్తులైనా లేదా జరిగే సంఘటన లేదా కనిపించే సన్నివేశానికి సంబంధించిన వేపైనా అన్నీ భగవదంశలే... మనలో ఉన్నదీ ఎదుటి దానిలో ఉన్నదీ ఒక్కటే అంశ... అదీ భగవంతుని అంశయే.. కాబట్టి మనల్ని చూసి మనమే భయపడడం నిజానికి అర్థ రహితం. అయినా భయపడతాము. ఇది సహజం.

రెండవది ఉన్నదనే ఆలోచనయే భయానికి మూలం అంటుంది, వేదాంతం. రెండవది ఉంటే ఎప్పుడైనా మొదటిదానిని రెండవది అధిగమిస్తుందనే ఆలోచనయే ఆ భయానికి మూలం.

అక్షరాలను నేర్చాం.. ఎన్నో చదివాం.. ఎందరి ఉపన్యాసాలనో విన్నాం... అవగాహన కుదిరింది.. తత్త్వం అర్థం అయినట్లే అనిపిస్తుంది.ఎన్నో వేదికలపై భగవత్తత్త్వం గూర్చి ప్రసంగించాం.. విషయం మనకు తెలుసు... అయినా భయపడతాం. ఎందుకు.. తెలిసిన విషయం మెదడుకే పరిమితమై మనసును తాకలేక పోవడం వల్లనే. ఎదురయ్యే సన్నివేశం ఎలాంటిదైనా ఆనందంగా స్వీకరించే మానసిక స్థితికి చేరుకోలేక పోవడం వల్లనే. ఎవరైతే అలా ఆనందంగా ఉండగలుగుతారో వారు భయరహిత స్థితికి చేరుకుంటారు.

భారతంలో ఉదంకుని గూర్చి చెపుతూ నన్నయగారు... అనాతంకమతి అనే పదాన్ని వాడుతారు. అనాతంకమతి అంటే భయాన్ని జయించిన వాడని అర్థం. భయాన్ని జయించేందుకు అదేమైనా కత్తి డాలు లేదా ఆధునిక తుపాకులో పట్టుకొని ఎదురుగా నిలుచుంటుందా... అలాంటి వస్తువు కాదుకదా... కాని ఎవరైతే భయం యొక్క తత్త్వాన్ని తెలుసుకుంటారో, అర్థం చేసుకుంటారో... వారు భయాన్ని జయించ గలుగుతారు. అంటే భయాన్ని వారు ఆదరించరు.. తనదిగా చేసుకోరు. తనది అనుకున్నది స్వార్థంగా ఒదిగిపోతుంది... మనదైన దాన్ని విడిచి పెట్టాలంటే మనం ఇష్టపడం.. అలాగే భయం ఎప్పుడైతే మనదిగా భావిస్తామో అప్పుడు దానిని కూడా స్వతంగానే భావిస్తాము కాబట్టి విడిచి పెట్టం.. అలా కాక అది మనది కాదని ఆదరించడం మానేస్తే అనాదరణకు గురైన భయం మనల్ని విడిచిపోతుంది. దేన్ని ద్వేషిస్తామో నిరంతరం దాన్నే స్మరిస్తాము. శ్రీ హరిని ద్వేషించిన హిరణ్యకశపుని మదిలో సదా శ్రీహరి స్మరణయే... అలా భయాన్ని ద్వేషించే వారి మనసులో కూడా ఆ భయమే గూడు కట్టుకొని అంచెలంచెలుగా ఎదుగుతూ ఉంటుంది. అలా వ్యాప్తి చెంది చెంది సమీప భవిష్యత్తులో మనసులో భయం మాత్రమే నిండిపోతుంది. అలాగే ఏదైతే ఆదరింపబడక నిరాదరణకు గురౌతుందో అది మనల్ని విడిచిపెట్టి వెళ్ళిపోతుంది. మన ఇంటికి వచ్చిన అతిథి, అతనెంత గొప్పవాడైనా ... కావలసిన వాడైనా ఇంట్లో ఎవరూ పట్టించుకోకపోతే ఎలాగైతే నిరాదరణకు గురై వెళ్ళిపోతాడో అలాగే భయం కూడా మన మనస్సు యొక్క అంతరంతరాల పొరలనుండి వెళ్ళిపోతుంది. ఏదైతే మననుండి విడిపోతుందో అది మనల్ని బాధించదు. భయం ఎప్పుడైతే ముఖం చాటేస్తుందో ఆ స్థానంలోకి "అభయం" లేదా "ధైర్యం"వచ్చి చేరుతుంది (ఏ స్థానమూ ఎప్పుడూ ఈసృష్టిలో ఖాళీగా ఉండదు కాబట్టి).

నిజానికి భయం అనేది వ్యక్తిలో కనిపించే భావోద్వేగ స్థితి మాత్రమే. కొంత వరకు అది అవ-

సరమే కాని దానిని ఎలా నిర్వహించుకోవాలో (మేనేజ్ చేయాలో) తెలియాలి. ఆ విధానం తెలిస్తే దాని మార్గాన్ని మళ్ళించి దానిని ఉపయుక్తం చేసుకోదగిన విధానాన్ని అన్వేషించవచ్చు. నిప్పు కాలుతుంది అనే విషయాన్ని తెలుసుకుంటాం.. అవగాహన పెంచుకుంటాం.. అప్పుడప్పుడు అనుభవంలోకి వస్తుంది కూడా! కాలుతుందనే భయం ఉన్నప్పుడు నిప్పును దూరంగా పెడతాము. కాని దాని స్వభావం అర్థం అయింది కనుక దానిని దూరంగా పెట్టడం కన్నా నిప్పుతో జాగ్రత్తగా ఉంటూ.. దానిని ఎలా ఉపయోగించుకోవాలో ఆలోచించడం వల్ల ఉపయోగం ఉంటుంది. భయాన్ని జయించడం అంటే ఇదే..

భయం ప్రశాంతతకు మొదటి శత్రువు. భయాన్ని జయించడం నేర్చుకుంటే ప్రశాంతత మనదౌతుంది. అపనమ్మకం భయానికి ఊపిరులూదుతుంది. నిజానికి భయం ధైర్యం రెండూ మానసిక స్పందనలే. భయాన్ని జయించాలి అంటే "నాకు భయం లేదు" అనేది తెలుసుకోవాలి. ఆ "తెలుసుకోవడాన్ని" అభ్యసించే మార్గాన్ని అన్వేషించాలి. అన్వేషిత మార్గంలో గమించడం వల్ల భయం తొలగిపోతుంది. ఆస్థానంలో ధైర్యం వచ్చి చేరుతుంది. ధైర్యంతో విచక్షణ, విచక్షణతో ప్రశాంతత వస్తాయి.

భయం స్వభావాన్ని అర్థం చేసుకోవడం వల్ల అది మన కల్పనయే అన్న సత్యం బోధపడుతుంది. సృష్టించడం చేతనైతే దానిని అంతం చేయడం సాధ్యమేనన్న సూత్రాన్ననుసరించి మనం సృష్టించుకున్న లేదా కల్పించుకున్న భయాన్ని మనమే అంతం చేయగలిగిన మార్గాన్ని అన్వేషించుకోవడం సాధ్యపడుతుంది. ఏ పని చేయాలంటే మనకు భయమో, ముందుగా ఆ పనిని చేయడం వల్ల భయం దూరం అవుతుంది. బలవంతంగానైన ఆ మానసిక స్థితిని పొందడం, భయం యొక్క పరిణామాలను అర్థం చేసుకోవడం, ఆ పనిని చేయకపోతే మనం ఏం కోల్పోయే ప్రమాదం ఉందో దాని వల్ల ఎదురయ్యే పరిణామాలేంటో అర్థంచేసుకోవడం, హేతుబద్ధంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించడం, భయాన్ని జయించాలనే తీవ్రమైన కోరికను పెంచుకోవడం, ఆ తపనను ప్రజ్వలింప చేసుకోవడం, ప్రయత్నలోపం ఏ మాత్రం లేకుండా యత్నించడం; వచ్చే ఫలితం జయమైనా అపజయమైనా సమభావనతో స్వీకరించ గలిగే మానసిక స్థితిని సన్నద్ధం చేసుకోవడం వల్ల భయం మనల్ని విడిచి పారిపోతుంది. భయరహితమైన మనస్సు ప్రశాంతతను అనుగ్రహిస్తుంది.

ఒక రాజ్యం ఉంది. ఆ రాజ్యానికి రాజు "కంగారు", మంత్రి "అజ్ఞానం", సేనాని "కోపం". ఆ రాజ్యం పై "భయం" దండెత్తి వచ్చింది. రాజు కంగారు పడ్డాడు, మంత్రిని సలహా అడిగాడు... మంత్రి అజ్ఞానంతో సేనానిని ప్రేరేపించాడు... సేనాని కోపం సామరస్యాన్ని మరచింది. ఫలితం... భయం గెలిచింది.

మరొక రాజ్యం ఉంది. ఆ రాజ్యానికి రాజు "ఆత్మ స్థైర్యం", మంత్రి "విచక్షణ", సేనాని "ధైర్యం". ఆ రాజ్యం పై "భయం" దండెత్తి వచ్చింది. రాజు బాధ్యతతో వ్యవహరించాడు, మంత్రిని సలహా అడిగాడు... మంత్రి విచక్షణతో ఆలోచించి వ్యూహాన్నిచ్చాడు.... సేనాని సాహసంతో ఎదిరించాడు. ఫలితం... భయం పారిపోయింది.

భయరహిత మనస్సులో భగవంతుడే స్థిర మూర్తియై నిలుస్తాడు.

ధైర్యంగా మీరొక నిర్ణయం తీసుకున్నారు. అది మీ జీవితాన్ని మార్చేస్తుంది. అది ఎట్టైనా కావచ్చు. సాహసంతో ముందడుగు వేస్తే మీ తరతరాల చరిత్రను మీరు మార్చేస్తారు. కాని మీలోని అంతర్గత భయం ఆ నిర్ణయానికి అనుక్షణం అడ్డు తగులుతుంది.

(ఇంకా వుంది)

# తెలుగు పద్య రత్నాలు - 20



ఆర్. శర్మ దంతుర్తి

ఈ నెల పద్యం మరోసారి పోతన మహాభాగవతంలోనిదే. మహాభాగవతంలో ఈ పద్యానికున్నంత ప్రసక్తి, ప్రాముఖ్యం మరే పద్యానికీ లేదంతే అతిశయోక్తి కాదు. దానిక్కారణం కిందన చూద్దాం.

మ. అలవైకుంఠపురంబులో నగరిలో నామూల సౌధంబుదా
పల మందారవనాంతరామృతసరః ప్రాంతేందుకాంతోపలో
త్పల పర్యంకరమావినోదియగు నాపన్న ప్రసన్నుండు వి
హ్వలనాగేంద్రము పాహిపాహియన గుయ్యాలించి సంరంభియై

(గజేంద్ర మోక్షం 79)

గజేంద్రుణ్ణి మొసలి పట్టుకుంది. నాకింత బలం ఉంది కదా ఈ మొసలి నన్నేం చేయగలదు అనుకుంటూ – అంటే 'నేను' అనేది మనసులో ఉన్నంతకాలం – పోరాటం సాగించింది ఏనుగు. ఎన్నటికీ వదలడం లేదు ఈ పట్టు. అప్పుడు, మనసులో మెదిలిన భావన ఏమంటే – ఈ ప్రపంచంలో ఇలా కర్మలు జరగడానిక్కారణం మనమే, అయితే ఈ జననమరణ చట్రంలోంచి బయటకి రావడానికి మన బుద్ధీ, ఇంద్రియాలూ, మనసూ ఎందుకూ పనికి రావు. ఈ దరిద్రం తప్పించుకోవడానికి మరో సాధనం ఏదో ఉండి ఉండాలి. దాన్ని ధర్మం అనీ సత్యం అనీ, భగవంతుడనీ ఏదో ఒకటి అనుకోవచ్చు. ఆయన/ఆవిడ కృప ఉంటే తప్ప నేను అశక్తుణ్ణి. ఆ శక్తి, పరమేశ్వరుడు అనుకుంటే, ఆయనే వచ్చి ఏదో చేయాలి తప్ప నా వల్ల కాదు అని మనఃస్ఫూర్తిగా శరణు జొచ్చే సమయానికి ఏమౌతుంది అనేదానికి ఈ పద్యం సమాధానం చెప్తుంది మనకి.

ఆ వైకుంఠ పురంలో ఏదో మూల సౌధంలో ఎక్కడో ఉన్నాడు భగవంతుడు. ఎలా ఉన్నాడో చూసినవాళ్లకి తప్ప తెలియదు. ఆ వైకుంఠం చూసినవారు భగవంతుణ్ణి చూసారు కనక ఆయనలో ఐక్యమైపోయి మాటా పలుకూ చెప్పలేరు. ఏదైతే మనం వివరించగలమో అది మన బుద్ధి మీద ఆధారపడుతుంది కదా? అయితే మన బుద్ధీ మనసు వివరించగలిగేది మన పరిధుల్లో ఉన్నది. అందువల్ల అది భగవంతుడు కాదు. భగవంతుడు అవ్యక్తుడు – ఇదీ అని ఎవరూ వ్యక్తపరచలేరు; అవ్యయుడు అంటే ఎన్ని కోట్ల ప్రాణుల్లో ఆయన అంశ ఉన్నా ఇంకా ఎప్పటికీ వ్యయం అయిపోని వాడు. పరిధులు అనేవి లేని వాడు. అటువంటి వాణ్ణి ఎవరైతే వివరించి 'ఇదీ' చెప్పగలరో వాళ్ళు అసలు భగవంతుణ్ణి చూసినవాళ్ళు కాదు అంటారు రామకృష్ణ పరమహంస. మరి ఇటువంటి వాడు ఉండే వైకుంఠం ఎలా ఉంటుంది అంటే అది చూడాలి తప్ప 'ఇలా ఉంటుంది' అని చెప్పడం అసంభవం కదా. సరే మరి ఇలా ఉంటుంది అని నోటితోనే

చెప్పలేం కనక మరి చూడలేని దాన్ని ఎలా వివరించి రాయడం?

అందువల్లే పోతన 'అలవైకుంఠపురంబులో నగరులో' అని రాసాక తర్వాత ఏం రాయాలో తెలియక ఆ పద్యాన్ని అలా వదిలేసి బయటకి వెళ్ళాట్ట ఏదో పనిమీద. వెనక్కి వచ్చి చూసేసరికి ఈ పద్యం మొత్తం రాసేసి ఉంది. 'అరే ఇది ఎవరు పూర్తి చేసారు,' అని ఇంట్లో ఉన్న కూతుర్ని పిలిచి అడిగాడు. 'నువ్వే కదా ఓ అరగంట ముందు వచ్చి రాసి వెళ్ళావు?' అందిట ఆ అమ్మాయి. 'అదేమిటి నేను బయటకి వెళ్ళి ఇప్పుడే కదా రావడం' అని పోతన అనేసరికి ఇద్దరూ ఆశ్చర్యపోయారు. అందువల్లే ఈ పద్యం సాక్షాత్తూ మహావిష్ణువే పోతన రూపంలో వచ్చి రాసాడని దీనికంత ప్రాముఖ్యం. ఈ పద్యం రాయడానిక్కూడా కారణం ఆ వైకుంఠపురంలో మహావిష్ణువు లక్ష్మీదేవితో ఆ మూల సౌధంలో ఎలా ఉంటాడో ఆయన ఒక్కడు మాత్రమే వర్ణించగలడు కనక.

ఈ పద్యంలో చెప్పేదేమంటే, వైకుంఠపురంలో ఆ మూల సౌధాల్లో ఎక్కడో మందారవనాల అవతల (కల్ప వృక్షాలతో నిండిన వనాలు), అమృతం వంటి నీరుండే కొలనులో దొరికే స్ఫటిక మణులవంటి నల్లకలువలతో ఉండే పాన్పుమీద (మందార, వనాంతర, అమృతసరః ప్రాంత, ఇందుకాంతోపలోత్పల, పర్యంక) లక్ష్మీదేవితో వినోదంగా ఉన్న (రమా వినోది), భగవంతుడు (ఆపన్న, ప్రసన్నుండు – ఆపన్నులకి, అంటే శరణుజొచ్చినవారికి స్వహస్తం ఇచ్చి ఆదుకునేవాడు, ప్రసన్నమైనవాడు), ఈ నాగేంద్రం 'పాహి పాహి' అనేసరికి ఒక్కసారి లేచాడు - గుయ్యాలించి సంరంభియై (మొర విని బయల్దేరాడు).

భగవంతుడో సాక్షి మనకర్మలకి. మనం ఏదో చేస్తే ఈ జన్మ వచ్చింది. చేసిన పనికి ఫలితం తప్పదు కనక అనుభవించి తీరాలి. ఈ జన్మలో అనుభవిస్తే సరే లేకపోతే ఆయుష్షు చాలకపోతే వచ్చే జన్మకి ఆ కర్మ తప్పదు. అయితే ఈ అనుభవించడంలో 'చేసేదంతా నేనే' అనే భావన ఉన్నంతవరకూ ఆయన అలా వినోదంగా చూస్తూ ఉంటాడు మనకేసి. ఎప్పుడైనే 'ఇంక నేను ఏమీ చేయలేను, కావవే రక్షింపు భద్రాత్మకా' అనే భావన రాగానే ఆయన బయల్దేరుతాడు. ఎలా బయల్దేరుతాడంటే – 'గుయ్యాలించి సంరంభియై, సిరికిం జెప్పడు, శంఖ చక్రయుగమున్ చేదోయి సంధింపడు..' అంటూ. మనం ఒక అడుగు ముందుకు వేస్తే మనని ఆదుకోవడానికి భగవంతుడు పది అడుగులు ముందుకు వస్తాడు. అయితే ఇక్కడ గుర్తుంచుకోవాల్సినదేమంటే మనం ఓ అడుగు వెనక్కి వేస్తే ఆయన పది అడుగులు వెనక్కి వెళతాడు. మరి మళ్ళీ వస్తాడా మరోసారి మనం ముందుకు వెళ్తే? తప్పకుండా. ఎందుకంటే కంచెర్ల గోపన్న చెప్పినట్టూ ఆయన – 'దాశరథీ కరుణాపయోనిధీ' కనక.

ఈ పద్య వృత్తం మత్తేభం; అంటే ఏనుగు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు తెలుగులో ముద్రించిన మహాభాగవతం పుస్తకాలకి జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు సంపాదకులు. ఆయన ముందు మాట రాస్తూ 'ఈ గజేంద్ర మోక్షంలో పోతన మత్తేభం మీద మత్తేభం ఎలా రాసాడో?' అంటారు. అందుకే ఈ పోతన భాగవతం అనేది తెలుగువాడు చేసుకున్న అదృష్టం. ఈ పద్యాలు చిరకాలం మన నాలుకలమీద నిలవడానిక్కారణం కూడా పోతన చెప్పినదే – 'పలికించెడువాడు రామ భద్రుడట...' ఇప్పుడీ పద్యం, ఇది రాసిన విధం చూస్తే 'పలికించెడు వాడు, అది పూర్తిగా రాసిపెట్టినవాడు రామభద్రుడట' అని కూడా చెప్పుకోవాల్సిందే.

# నవవిధ భక్తులు



ఆదూరి హైమవతి

"బామ్మా! బామ్మా!"అంటూవచ్చి ఇంచుమించు ఒళ్ళో కూర్చున్నట్లే అనుకుని కూర్చుంది కుమారి.

"ఏమైంది కుమారీ !"అంటూ మనవరాలి బుగ్గమీద ముద్దు పెట్టుకుని అడిగింది బామ్మ భానమ్మ.

"బామ్మా! మాస్కూల్లో మాతెలుగు టీచరుగారు వచ్చే శనివారం ఒక క్విజ్ పెట్టారు బామ్మా!అదేంటంటే సంఖా శాస్త్రం గురించీ.అంటే మాక్లాసులో 30మందిమి ఉన్నాం మాటీచర్ మమ్మల్ని పదిగ్రూపులు చేశారు. మాది తొమ్మిదో గ్రూపు. ఒక్కో గ్రూపులో ముగ్గురం .ఆక్విజ్ లో ఆధ్యాత్మిక సంబంధమైనది. అంటే మేమంతా సంఖ్యాశాస్త్రం ప్రకారం ఒకటినుండీ పది వరకూ పది గ్రూపుల వారమూ ఆధ్యాత్మికకవిషయాలు నీతి దాయకంగా చెప్పాలిట. బామ్మా! మాది తొమ్మిదిసంఖ్య, దీంతో మేము చెప్పాలి .బామ్మా ప్లీజ్ చెప్పవూ!-నాకు కథలను ఇచ్చారు,ఒకరేమో పద్యాలు ,మరొ కరు శ్లోకాలు, నీతి వాక్యాలూనూ.ప్లీజ్ బామ్మా!అంటూ బుగ్గలుపట్టుకుని బ్రతిమాలుతున్న కుమారిని మురిపెంగాచూస్తూ అంది బామ్మ.

"చెప్తాను,తప్పక చెప్తాను.అడగాలేకానీ మేం టీచర్లము కదా! అడిగితే చెప్పకుండా ఉండలేము. మరి జాగ్రత్తగా విను.నవసంక్యతో చాలానే ఉన్నాయి.

భక్తి అంటేఒక పవిత్రమైన భావన. మనుషులలో భక్తి భావన కలవారిని భక్తులు అంటారు.భక్తి యోగం గురించి భగవద్గీతలో ఉంది. నారద భక్తి సూత్రాల్లో కూడా చాలా విధాల భక్తిగురించి ఉంది.

భగవంతుని పొందడానికి భాగవతంలో నవవిధభక్తి మార్గాలు అనగా 9 రకాలైన భక్తి మార్గాలు చెప్పబడ్డాయి. భాగవతంలోని ప్రహ్లాద చరిత్ర లో ఈ 9 రకాల భక్తులగురించీ చెప్పిన శ్లోకం ఏంటంటే

**శ్రవణం కీర్తనం విష్ణోః**
**స్మరణం పాద సేవనం**
**అర్చనం వందనం దాస్యం**
**సఖ్యమాత్మ నివేదనం**

అంటే భగవంతుని పూజింపడానికి అనేక విధాలైన మార్గాలున్నాయి.నవవిధ భక్తిమార్గం : 1.శ్రవణము 2.కీర్తనము 3.స్మరణము 4.పాదసేవనము 5.అర్చనము 6.వందనము 7.దాస్యము 8.సఖ్యము 9.ఆత్మ నివేదనము-"అని

"బామ్మా! ఇదంతా చెప్తే ఎవ్వరూ వినరు మెమ ఓడిపోతాం.బామ్మా కథగాచెప్పు బామ్మా!"

"చెప్తానుంతల్లీ ఐఅతె ఏవరైనా అడిగితే నీకు బేసిక్స్ కొంతైనా తెలియాలావదా! వారికి సమాధాన్మ చెప్పలైఅక్డే! అందుకె అముందు భక్తి గురించీ చెప్పి, ఆతర్వాత నీక్కావల్సిన కథలు చెప్తాగా!విను. మొదటిది శ్రవణం.

నవవిధ భక్తులు.



శ్రవణం: భగవంతుని గూర్చిన కథలు, భజనలు, కీర్తనలు వినటం - ఇలా వినితరించిన వారు ధర్మరాజు, జనమేజయుడు, శౌనకాది మునులు.

రెండవది కీర్తనం: భగవంతుని గుణగణములను,శక్తులను, మహిమలనూ కీర్తించుట: రామదాసు, దాసగణు, అన్నమయ్య, త్యాగరాజు, తులసీదాసు, మీరాబాయి -ఇంకా చాలామంది గాయకులు ఇలాకీర్తించారు..

మూడవది -స్మరణం: భగవంతుని స్మరించుట - ప్రతి నిత్యం-ధ్యానం చేసే కోట్లాది భక్తులన్నమాట.

పాదసేవ: దేవుని పాదముల పూజ సేయుట

తర్వాతది అర్చనం: గుడిలోగాని, ఇంటిలోగాని, హృదయములో గాని భగవంతుని అర్చించుట.

తర్వాతది వందనం: భగవంతునికి మనసారా ప్రణామం చేయుట

దాస్యం: భగవంతునకు దాసుడగుట - హనుమంతుడు, రామదాసుమొదలైనవారు.

సఖ్యం: అంటే స్నేహ భక్తి అర్జునుడు శ్రీకృష్ణుని స్నేహితునిగ అభావించి అనునిత్యం దగ్గరగా ఉంది తరించాడు.

చివరిది ఆత్మనివేదనం: తనను తాను పూర్తిగా దేవునకు సమర్పించుకొనుట - గోదాదేవి, మీరాబాయి వంటివారు.

నీకిప్పుడు మొదటిదైన శ్రవణం గురించినకథ చెప్తాను విను.

1.శ్రవణం.

పూర్వం అవంతీరాజ్యాన్ని అనుపమ వర్మ అనేరాజు పాలించేవాడు. ఆయన చాలా మంచివాడు.ప్రజలందరినీ బాగాచూసుకునేవాడు. ఆ రాజ్యంలోప్రజలంతా చాలా సుఖంగా ఉన్నా అప్పుడప్పుడూ పెద్ద ఎత్తున దొంగతనాలు జరుగుతుండేవి. ప్రజలు భయపడిపోసాగారు. మహారాజు తన మంత్రులతో,-పురోహితునితో, బాగా చర్చించి "భక్తి గురించీప్రచారం చేస్తే ఆదొగలేవరో వారు విని దొంగతనం చేయరనే ఉద్దేశ్యంతో తన రాజ్యం నలుమూలలా భగవత్ భక్తిని గురించీ ప్రచారం చేయను అనేకమంది కళాకారులను పిలిపించి , హరికథలూ, బుర్రకథలూ, సత్సంగాలూ, ఉపన్యాసాలూ చెప్పించసాగాడు.

ఆనగరంలో ఉన్న ఒక గజదొంగ ఇదివిని తనకుమారునిపిలిచి "నాయనా! మనవృత్తి దొంగతనం . నీవు మనరాజ్యంలో జరిగే ఏ హరి కథా ,బుర్రకథల వంటివి ఏవీ వినకు. నీకు ఇప్పుడిప్పుడే మన వృత్తి గురించిన పాఠాలు చెప్తున్నాను. నీవు వేరే విషయాలు వింటే నేను చెప్పేవి తలకెక్కవు. జాగ్రత్త " అని చెప్పాడు .

ఆ దొంగ కుమారుడు మాధవుడు తండ్రిమాటకు తలఊచాడు, ఐతే పిల్లలకు ఏది వద్దంటే అది చేసే ఆసక్తి కలుగుతుందని పాపం చదువంటే తెలీని మాధవుని తండ్రి ఐన పెద్ద దొంగ గంగులుకు తెలియదు.

తండ్రి ఏదివద్దన్నాడో అదేంటో తెలుసు కోవాలని మాధవుడు ఆరాత్రి తన గ్రామ సమీపాన జరుగున్న భాగవత సప్తాహ పురాణ శ్రవణానికి వెళ్లాడు.


అక్కడ ఆ వేద పండితుడు "భక్తులారా భగవంతుడు దయామయుడు ఎవరైతే తనను పూజిస్తూ జపిస్తూ ధ్యానిస్తూ ఉండేవారిని ఎంతకష్టంలోవున్నా కోరగానే కాపాడుతాడు. మానవులకు అసలైన తల్లీ, తండ్రీ, గురువు, దైవం, స్నేహితుడు, సర్వం ఆయనే. మిగతావారంతా ఎప్పటికైనా వెళ్ళిపోవచ్చు, వదలి పోవచ్చు. కానీ దైవం భక్తులను ఎన్నటికీ వదలడు , మనం మన మనస్సుల్లో ఆయన రూపాన్నీ ధ్యానిస్తూ నామాన్ని జపిస్తూ అంటే అనుకుంటూ ఉంటే తప్పక దైవం కాపాడుతాడు."అని వారికి అర్థమయ్యే తేలిక భాషలో చెప్పాడు. చక్కగా పద్యాలు, పాటలూ పాడాడు.

చివరలో "భక్తులారా! మీకు అంతా గుర్తుండకపోతే భగవంతుని ఒక్క నామాన్ని నిద్రలోసైతం మరువక జపించండి.పైకి అనక్కరలేదు.లోపల అనుకుంటే చాలు. 'రామా! అనో కృష్ణా అనో జపించండి" అని చెప్పాడు. ఎందుకో మాధవునికి ఆయన మాటలు బాగా నచ్చాయి. ఆక్షణం నుంచీ అతడు 'కృష్ణా' అనేపదం పలుకలేక సులువైనదిగా భావించిన 'రామ' నామాన్ని జపించడం మొదలెట్టాడు. ఆక్షణంనుండీ గాలి పీల్చినా, వదలినా రామ రామ అనుకోడం గాలిపీల్చినంత సహజంగా చేయసాగాడు.అంతేకాక తమగ్రామంలోని విద్యాలయానికి వెళ్ళి విద్యనభ్యసించసాగాడు. మంచి పండితుడుగా మారాడు.

రోజులుసంవత్సరాలుగా గడుస్తున్నాయి. ఒకరోజున తండ్రి గంగులు పెద్ద దొంగతనం చేస్తూ రాజసైనికులకు పట్టుబడ్డాడు. రాజు అతనిని విచారించి అతడే రాజ్యంలోని అన్ని దొంగతనాలకూ దోపిడీలకు కారకుడని రుజువయ్యాక అతడికి మరణ శిక్ష విధించాడు.

(ఇంకా వుంది)

# మా ఊరి నందుల ఆత్మీయ కథ



## నందుల ప్రభాకర శాస్త్రి

(గత సంచిక తరువాయి)

ఊరిలో అందరు చందాలు ఇచ్చి, భోజనాలు పెట్టి వారి పశువులకు మేత కూడా ఇచ్చి వారం, పది రోజులు సత్కరించేటప్పటికి ఊరికి భారమై పోతుంది. ఆ తర్వాత వేరే ఊరికి బయలుదేరతారు.

తనకు ఎప్పుడు ఇష్టమైతే అప్పుడు బ్రాహ్మణుల ఇళ్ళకి వచ్చి ఉభయం చెప్పుకుంటాడు. ఆ రోజంతా ఊరిలో భజన చేస్తాడు. ఆంజనేయ భక్తుడు ఈయన. ఈయన పేరు అనంతయ్య. భక్తి పారవశ్యంలో భజన చేసేటప్పుడు ఆంజనేయుడిలాగా మూతి బిగించి, తన్మయత్వంలో మునిగి పాటలు పాడతాడు. ఊరి జనం అంతా ఈయన చుట్టూ మూగి ఆనందిస్తారు. ఊరిలో ఎవరైనా ప్రశ్న అడిగితే చెపుతాడు. భవిష్యత్తు గురించి, జరగబోయే మంచి-చెడుల గురించీ చెబుతాడు. మితభాషి. ఎవ్వరితోనూ ఎక్కువగా కలిసిపోడు. ఆయన ఏంటో, ఆయన పనేంటో... అంతే.

మరో అతిథి... తిక్క నరసింహులు. ఈయన స్వస్థలం కోడూరు. ఎవరికైనా, ఏదైనా సహాయం అవసరపడితే బ్రాహ్మణ ఇళ్ళల్లో సహాయం చేస్తాడు. మరీ ముఖ్యంగా అపరకర్మలకు ముందుంటాడు. ఈయన ప్రత్యేకత ఏమిటంటే... ఈయన చేతికి ఎప్పుడూ గడియారం ఉంటుంది. అది ఎప్పుడూ పని చేయదు. దానికి ముళ్ళు ఉండవు. కేవలం డబ్బా మాత్రమే ఉంటుంది. ఈయనను చూచిన ప్రతి ఒక్కరూ 'టైము' అడుగుతారు. ఈయన కూడా విసుక్కోకుండా ఎంతమంది అడిగినా చాలా ప్రత్యేకంగా 'ఫీల్' అయి చెప్తాడు. అయితే ముందు ఆకాశంలో సూర్యుడి వైపు ఒక కంటితో చూసి, ఆ గడియారం వైపు చూసి 'టైం' చెప్తాడు. అడిగినవారు నవ్వుకుని సంతోషిస్తారు. ఆయన తన గడియారాన్ని ప్రజలు గుర్తించినందుకు ఆనందిస్తాడు. చదువుకునే పిల్లలు 'వారాలు' మాట్లాడుకుని ఏవారం ఎవరింట్లో అయితే ... వాళ్ళ ఇంటికి వచ్చి పోతుంటారు. ఇక నెత్తి మీద చీరాల మూటలవాళ్ళు, ఇసుర్రాళ్ళు మలిచేవారు వస్తూనే ఉంటారు.

మాలేపాటి గోవిందమ్మ. ఈమె కూడా బ్రాహ్మణుల ఇండ్లలోని శుభాశుభాలకు తప్పక వచ్చేది. ఏమీ ఆశించకుండా అన్ని పనులు చేసి కేవలం భోజనం చేసి వెళ్ళేది. ఈమె యుక్తవయసులో ఉండగా చేసిన ఒక పని వల్ల సాంఘికంగానూ, కులపరంగానూ వెలివేయబడింది. ఒక పోలీసు అధికారిని ప్రేమించి ఆయనతో వెళ్లిపోయిందట. ఆ తరువాత కొద్ది సంవత్సరాలకు తిరిగి వచ్చింది. పలుగురాళ్ళపల్లె లోని బ్రాహ్మణ అగ్రహారులు ఆమెను వెలివేశారు.

వీరి అమ్మ మాలేపాటి లక్ష్మమ్మ. మా నాయన నందుల సుబ్బరామయ్య గారి దగ్గరకు వచ్చి ఈ వెలివేసినదాన్నించి తనను కాపాడుకోమని వేడుకుంది. నాన్నగారు అప్పటికే సంఘ సం-



స్కర్తణలపై అధ్యయనం చేసివు-న్నారు. పశ్చాత్తాపానికి మించిన శిక్ష లేదని నమ్మేవారు. అందుకే ఈమె విషయమై తెనాలిలో బస చేసిన శృంగేరి పీఠాధిపతుల దగ్గరకు వెళ్లి ప్రస్తావించగా, వారు ఆమెను క్షమించి పశ్చాత్తాప-పడుతున్నారు కాబట్టి వంట, వార్పు విషయం లాంటి విష-యాలలో ఆమెకు భాగస్వామ్యం ఇవ్వకుండా కేవలం ఊరిలోకి అనుమతి ఇచ్చి బ్రాహ్మణుల ఇండ్లలో మిగతా కులాలవారిగా ఉండవచ్చని ఆజ్ఞాపించారట. మా పెద్ద మేనత్త చనిపోయిన రోజు ఆమె దహన సంస్కారాలు చేయటానికి, శవాన్ని మోయటా-నికి ఎవరూ లేకపోతే మా నాయన ఒక వైపు, తిక్క నరసింహులు, తొలశమ్మ అనే మరో బ్రాహ్మణ స్త్రీ ఇంకో వైపు పాడె మోశారట . ఈ తొలశమ్మ కూడా ఒక సంఘసే-విక అనే చెప్పాలి. చిన్నపిల్లలకు స్నానం చేయించినట్టు శవానికి స్నానం చేయించి పాటలు పాడి శవాన్ని మోసింది. ఈమె కూడా అప్పుడప్పుడు అతిథి లాగా మా ఊరికి వస్తూ ఉంటుంది.

ఒకరోజు ఎవరికీ పరిచయం లేని అతిథి తమిళనాడు కుంభకోణం నుంచి వచ్చాడు. ఆయన పేరు చెప్పలేదు గానీ అందరూ కుంభకోణం అని పిలిచేవా-రు. కానీ చాలా పెద్ద పొట్ట, భారీ కాయం, కదలటం చూస్తే బుల్ డోజర్ కదిలినట్టే ఉంటుంది. నెత్తిన ఒక పెద్ద మూట పెట్టు-కుని, మా పెద్దనాన్న దగ్గరకు వచ్చి భోజనానికి ఇంటికి వస్తా-నన్నాడు. అప్పుడు మా పెదనాన్న 'తప్పకుండా రండి మాకున్నది కలో, అంబలో, సంకటో పెడ-తా'మన్నాడు. ఆమాట వినంగానే నిజంగా సంగటే పెడతారేమోన-ని రాయిపెద్ది వెంకటరమణయ్య గారి ఇంటికి వెళ్ళాడు. భోజనానికి వెళ్ళగానే మీ 'ప్రవర' ఏమిటో చె-ప్పమన్నాడు ఆయన.

మాలాంటి సద్బ్రాహ్మణుని 'ప్రవర' అడిగి అవమానిస్తావా? అంటూ కోపగించుకుని మళ్ళీ మా ఇంటికే వచ్చి భోజనానికి వస్తానన్నాడు.

మా అమ్మకు ఇలాంటి వారి భోజనాల విషయాలు తెలుసు. అందుకే ముందుగా తగు జా-గ్రత్తలు తీసుకుని పెద్ద గిన్నెడు పచ్చడి, కుండెడు మజ్జిగ, రెండు శేర్ల బియ్యం, వండి సిద్ధం చేసింది. ప్రత్యేకంగా బాదం ఆకులతో చేసిన విస్తరి పెద్దగా కుట్టి వడ్డన సిద్ధం చేసింది. ఆయన మంచినీళ్లు వేరేవాళ్ళ పాత్రల్లో తాగరు.ఆ మూటలో పలురకాల సైజుల్లో వున్న చెంబులు, లోటాలు మడుగు నీళ్లతో నింపుకుని భోజనానికి కూర్చున్నాడు.

దగ్గర దగ్గర రెండు గంటల సమయం పట్టింది. అన్నీ సం-పూర్ణముగా తినేసి తృప్తిగా త్రేంచి లేచాడు. అమ్మ మా అందరికీ మళ్ళీ వంట చేయాల్సివచ్చింది. సాయంత్రం వరకు పండుకుని కోడూరు బయలుదేరాడు. మా తమ్ముడు రవీంద్ర శర్మ ఆయన మూట ఎత్తుకుని కోడూరు కొండా పెద్ద మోటు వరకు సాగనంపి వచ్చాడు. అప్పటినుండి ఎవరు అన్నం అవసరానికి మించి తిన్నా 'కుంభకోణం' అని పిలిచేవారు.

సంవత్సరానికో సారి వచ్చి, ఓ నాలుగు రోజులుండి, అందరికీ వినోదాన్ని పంచి, విస్మయాన్ని కలిగించి, కథలు, గాథలు చెప్పి, అలరించి పోయే అతిథి 'బీగాల సాయిబు'.ఈయన పేరు ఎవరికీ తెలియదు.

(ఇంకా వుంది)



# గడి - నుడి

చాగంటి కృష్ణకుమారి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | ■ | 4 | 5 |
| ■ | ■ | | ■ | ■ | 6 | 7 | ■ | |
| 8 | | | ■ | 9 | ■ | 10 | | |
| | ■ | ■ | 11 | | | ■ | ■ | |
| 12 | | | ■ | | ■ | 13 | | |
| | ■ | ■ | 14 | | | ■ | ■ | |
| 15 | | 16 | ■ | | ■ | 17 | | |
| | ■ | | 18 | ■ | ■ | | ■ | ■ |
| 19 | | ■ | 20 | | | | | |

## సూచనలు:

## నిలువు:

2. దీ నిని రసాయానికులు 'అవును' అని అర్ధం వచ్చే అక్షరం తో సూచిస్తారు(3)

3.కలప , ఇగ్లీషులో టింబర్ అనికూడా అనవచ్చు(2) ( కిందనుండి పైకి)

5.బొగ్గుపులుసు వాయువు(7)

7. భార్య (2)( కిందనుండి పైకి)

8. ఇంధనాలు అసంపూర్ణంగా దహన మైనపుడు వెలువడే మండే విషవాయువు (7 ) ( కిందనుండి పైకి)

9. మంథనము(5)

16.వృద్ధి (2)

17.ఈ లోహ మూలకపు పర(ఆణు సంఖ్య 24 (3)

18. ఏమిటిది అంటావా? శక్తి పరిమాణాన్ని వ్యక్త పరచే యూనిట్ అని నేనంటాను (2)

## సూచనలు:

1.తెల్లని స్ఫా టిక చూర్ణము. వెండి సమ్మేళనమైన ఇది కాంతి తగిలితే నల్లగా మారుతుంది.(6)

2. లోటులేదుకచ్చితమే అంటున్నానా --- మొదటి రెండు(2)

6. ఉలికిపడదు, శిల్పాలను చెక్కుతుంది.(2)

8. సల్ఫర్ మూలకపు ఇనార్గానిక్ ఆనయాన్ . ( 3) వెనకనుండి ముందుకి

10 . ఈ కర్బన సమ్మేళనంలో 8 కార్బన్ పరమణువు-లు 18 హైడ్రోజన్ పరమాణువులు ఉంటాయి. దీని ఐసో (iso- )రూపమైన ఒక సమ్మేళనాన్ని పెట్రోల్ లో పెంటేన్ తో పాటూ కలుపుతారు.అటువంటి మిశ్రమంలో 90 శాతం ఇది వుంటే ఆ పెట్రోల్ ఆక్టేన్ రేటింగ్ 90 అని లెక్కకడతారు. (3)

11 దేవ కాంచనంలో వున్నదో మంచు పర్వతపు మొదలు (3)

12.తొమ్మిది కార్బన్ పరమాణువులున్న ఒక పారఫిన్( 3)

## అడ్డము:

13 . ఇంటిలోని పోరు ఇంతింత...... (3)

14. ఇంగ్లీషులో exponentఅంటారు. ఉదాహరణకి bn,లో b యొక్క --- n (3)

15. గాసొలిన్ లో ఐసొ ఆక్టేన్ తోపాటూ ఈ పారఫిన్ న్ని కలుపుతారు.(3)

17.శాస్త్రీయ నామము Etroplus maculatus ఆరంజ్ లేదా పసుపు రంగుతో ఎర్రని మచ్చల-తో వుండే ఒక జాతి చేప (3)

18.Meningitis ని తెలుగులో మెదడు—రోగము అంటారు. మెదడు, వెన్నుపూసను కప్పి ఉంచే రక్షిత పొరలకు వైరస్ లు, బ్యాక్టీరియా లేదాఇ-తర సూక్ష్మజీవులు సోకడం వల్ల వస్తుంది.(2) వెనకనుండి ముందుకి

19.ఈ చెట్టు వృక్ష శాస్త్ర నామం Coffea.

20. సల్ఫ్యూ రస్ ఆమ్లపు బేరియం లవణము (6)

---

# నవంబరు నెల గడి -నుడి సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ప | ర | ప | రా | గ | సం | ప | ర్క | ము |
| రా | | క్ష | | ర | | గ్గ | | ర్క |
| అ | | ము | | ళ | | ము | | ప |
| య | తీ | | పా | ము | లు | | సీ | సం |
| స్కాం | | దో | ర | | తా | ర | | గ |
| త | పీ | | కు | ము | దం | | గి | రా |
| ధ | | ము | | క | | ము | | ప |
| ర్మ | | య | | న | | వ్య | | త్మ |
| ము | ణ | క్ష | ల | క | ర్ష | క | ర్థా | ఆ |

# కవి దేవరాజు -రచయిత మహారాజు



తుమ్మూరి రాం మోహనరావు

డా. దేవరాజు మహారాజు వృత్తిపరంగా శాస్త్రవేత్త. కథా రచయితగా, నాటకకర్తగా, కవిగా, అనువాదకుడిగా, కాలమిస్టుగా, వ్యాసకర్తగా అనేక రచనలను చేశారు. సమాజంలో శాస్త్రీయ అవగాహనను పెంచడానికి సరళ విజ్ఞాన శాస్త్ర గ్రంథాు, వ్యంగ్యరచను కూడాచేశారు.

దేవరాజు మహారాజు ఫిబ్రవరి 21,1951 న జన్మించారు. పుట్టింది వరంగల్ జిల్లా కోడూరులో ఐనా, విద్యాభ్యాసం వీరి స్వగ్రామమైన వడపర్తిలో మరియు భువనగిరి, హైదరాబాదులలో సాగింది. ఉస్మానియా విశ్వవిద్యాయం నుండి జంతుశాస్త్రంలో ఎం.ఎస్సీ చేసిన వీరు ఆ తరువాత డాక్టరేట్ కూడా అందుకున్నారు. వృత్తిపరంగా జువాలజీ ప్రొఫెసర్ గా పనిచేస్తూ పరాన్న జీవులపై విశేష పరిశోధన సల్పటమే గాక అనేకమంది పరిశోధక విద్యార్థులకు గైడ్ గా ఉన్నారు. వృత్తిపరంగా బిజీగా ఉన్నా, వీరుప్రవృత్తి పరంగా కూడా అంతకంటే బిజీగా ఉండటం వీరి సమయ సద్వినియోగ లక్షణాన్ని తెలుపుతుంది. కొందరి గురించి రాయవలసిన విషయాలు ఎక్కువై ఏవిరాయాలో ఏవి వదిలి వెయ్యాలో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పుడు వీరి గురించి అంతే.

మిత్రుడు తాళ్లపెల్లి మురళీధర్ గౌడు ద్వారా పరిచయమైన డా. దేవరాజు మహారాజుగారి పుస్తకాలను సమీక్షించే అవకాశం కలిగింది చాలా రోజుల క్రితం. ఆ వ్యాసాన్ని దేవరాజు మహారాజు 'ఆవరణం' లో సంకలించారు. దానిలో వారిలోని కథారచయిత పార్శ్వాన్ని కొంతవరకు చెప్పే ప్రయత్నంచేశాను ఇలా......



ఎంచుకున్న అంశం కవిత్వానికి లొంగకపోతే లేదా ఒదగకపోతే కథ ప్రక్రియచేపట్టిన రచయిత డా॥ దేవరాజు మహారాజు. విజ్ఞాన సోపానాలనధిరోహిస్తూనే నూనూగు మీసాల నూత్న యౌవనంలో తాను పొందిన అనుభూతుల్ని కవితలుగా మలుస్తూ పట్టాతో పాటు కవిత చిట్టాను పెంచుకుంటూ అపూర్వంగా తెలంగాణా మాండలికంలో కవిత ను వెలువరించి తనకంటూ ఒక ప్రత్యేక ముద్రను ఏర్పరచుకున్నవారు దేవరాజు. జంతుశాస్త్రంలో నిమటోడ్స్ వంటి పరాన్నజీవుల-

పైన పరిశోధన సల్పిన ఈ శాస్త్రవేత్త సమాజంలోని పరాన్నజీవులపైన తమ పరిశీలన చేసి ప్రతిస్పందనగా కవిత రూపం లోనో కథానికగానో, డాక్యుమెంటరీస్‌గానో, మనిషి కతలుగానో వెలువరించారు.

ఆహారం జీర్ణమయితేనే శక్తి రూపొందుతుందనేది శాస్త్రీయ సత్యం. అలాగే అంశం పూర్తిగా అవగాహన అయితేనే అచ్చమైన సాహిత్య రూపం ఏర్పడుతుందనేది వీరికి అనుభవైకవేద్యం. వీరి నాలుగు దశాబ్దాల సాహిత్య ప్రస్థానంలో కవితలను పండించారు. కథను చైతన్యవంతం చేశారు.

పైన చెప్పినట్లుగా సమాజంలోని పరాన్నజీవులను పరిశీలిస్తే హానికారకమైనవీ, ప్రయోజనకరమైనవీ ఎందుకూ పనికిరానివీ వుంటాయి. పరుల సొమ్ము నాశించి లంచగొండులుగా మారిన ప్రభుత్వోద్యోగులు మొదటి రకానికి, చేయూతనందిస్తే చేతనైనంత పనిచేయగలిగే బడుగు వర్గాలవారు రెండవరకానికి చేరుతారు. తల్లిదండ్రులో, పోషకులో సంపాదిస్తే ఊరికే తిని తిరుగుతూ ఏ పనీ పాట లేకుండా జులాయిగా తయారయినవాళ్ళు మూడోరకానికి వస్తారు. దేవరాజు గారి దృష్టి ఈ మూడు రకాల వారి మీదా వుంది. ఈ మూడురకాల వ్యక్తుల వల్ల ఎలాంటి



సమాజం ఏర్పడుతుందో వారి రచనల్లో మనకు స్పష్టంగా కన్పిస్తుంది. తనకు తెలిసిన విషయాన్ని ఎవరికి చెప్పాలి? ఎందుకు చెప్పాలి? ఎలా చెప్పాలి? అనేది అర్థమయితే ఆ రచయిత ప్రయత్నం సాఫల్యం చెందుతుంది. ఈ విషయంలో దేవరాజు మహారాజు కృతకృత్యుడైన సాహితీ స్రష్ట.

'పాలు ఎర్రబడ్డాయి' 'దేవరాజు మహారాజు' కథలు అన్న వీరి పుస్తకాలు చదివినపుడు ఆయన ఎన్నుకున్న అంశాల గురించి చూసినపుడు వీరు సమాజంపట్ల ఎంత బాధ్యతను కలిగివున్నారో అవగతమౌతుంది.

పేదరికం జీవితాన్ని ఎలా అతలాకుతం చేస్తుందో వీరి కథల్లో కనిపిస్తుంది. మచ్చుకి`

''భయంకరమైన వాటిని చూస్తేనే భయం కలుగుతుందనటం పొరపాటు. మనసు ఎదుటి వస్తువుపై ఏర్పరచుకొన్న అభిప్రాయాన్ని బట్టి వుంటుంది అనుభూతి''.

''ఆమె దగ్గర పాలెన్ని వున్నాయో అంతకు పదిరెట్లు కన్నీళ్ళు ఉన్నాయి. కానీ కన్నీళ్ళకు ఖరీదు కట్టి ఎవరూ తీసుకోరు''.

''పాలు చేతి రక్తమూ కలిసి సన్నని ధారగా ఆమె కడుపు మీద పారుతున్నాయి''.

ఇవి 'పాలు ఎర్రబడ్డాయ్' కథలోని మౌలిక జీవద్వాక్యాలు. వీటిని పెనవేసుకున్న పేద నిస్సహాయ తెలంగాణా మాతృమూర్తి జీవితం బడుగుజీవుల బతుకుకు మచ్చుతునక.

చాకిరేవు దగ్గర ఒంటికాలు ముసలాయన్ని చూసి, ప్రమాదంలో కాలుకు గాయమైన పెనిమిటిని ఊహించుకుని, పచ్చి బాలెంతరాలు పసిదాని నోరుకొట్టి, ఇంటికి పెద్దదిక్కును కాపాడుకోవటం కోసం పెద్దింటి బాబుకు పైసలకు పాలిచ్చే దయనీయ పరిస్థితిని గుండెకరిగేలా చూపించారు కథలో. మనసు కంటి లోకి దూరిందా అన్నట్లుంటుంది కథ.

అలాగే మరోకథ 'చీకటి'`

'అశాంతి కాలిపోతోంది. భయంకర శాంతి మాత్రం నగరం నుమూలా నిలిచి వుంది'.

'ఆమె వృత్తి చెడు. దాని ఫలితం నుంచే మంచిని పెంచుతోంది'.

'ఆమెకు బొగ్గుకూ తేడాలేదు'.

'వచ్చేవాళ్ళు ఆమె శవంతో పోరాడి మరీ పోతారు. అమెకు వాళ్ళు అయిష్టంతో కావాలి'.

పై మాటలు చీకటి కథకు అస్థి-పంజరం లాంటివి. ముగింపు వాక్యం అన్యాయాన్ని అశాంతిని కాపలా కా-స్తున్నట్లు పోలీసు బూట్ల టకటక. కవితాత్మక వాక్యం. కరువులోకర్ఫ్యూ` చీకటి బతుకుదెరువులో చీకటి. భ్రష్టాచార రక్షణ వ్యవస్థ బజారు జీవితం కన్నాహీనం అనిపించే కథ 'చీకటి'.

కవితాత్మక వ్యంగ్య కథ 'నీడలు -నిజాలూ'

నాగరికం వరదలో కొట్టుకుపోయే పువ్వైతే ఎలా అని బిచ్చపు కుంటిది చంటిదాన్ని చెంపదెబ్బ కొట్టడం కుహనా సంస్కారానికే చెంపదెబ్బ. పూలమ్మేవాడి ఆలోచనల్లోపూల-మనసు దూరటం కథనవైచిత్రి.

జీవించినంతసేపూ శవంలా వుండి, శవంగా మారిన తర్వాత జీవించిన 'ఆమె' కాలనిచితి 'వక్షో-జ్వాల'

ఉన్నవాడూ, ఉదారుడూ అయినా పోయిన్నాడు పీనుగ ఊరేగింపు పుడక దాకా చేరకపూలపడవై



వరదలో కొట్టుకుపోవడం`శవం నడిచి వెళ్తుంది.

నిరాశ తారస్థాయికి చేరి ఆత్మ-హత్యే శరణ్యం అన్న ఆలోచనతో కథ సాగుతూ అకస్మాత్తుగాచూ-పుల్లోకి అడుగేస్తూ ఆశలు నాటిన అమ్మాయి పలుకరింపుతో మలుపు తిరిగిన కథ'బతుకు తీపి'. నైరాశ్యం రేకెత్తించే ఆలోచన తీవ్రతకు అద్దం పడుతుంది.

అలాగే కన్నీళ్ళు తిరగబడ్డాయి. దొంగలు వంటికథల్లో మానవత్వం మరణించిన ఆసుపత్రి` భార్యను బతికించుకోలేని మధ్యతరగతి మనిషి గుంజాటనలో నుండి ఆవి-ర్భవించిన ఆగ్రహజ్వాల, అలాగే నమ్మించి మోసం చేసే ఆరితేరిన దొంగలుంటారు అని తెలియజే-ప్పే అంశాలున్నాయి. ప్రాబబులిటీ కలిగిన కథలు.

ఇక దేవరాజు మహారాజు కథలు చదివితే వారి ప్రయోగశీల మన-స్తత్వం గోచరిస్తుంది. ఈసంపుటి లోని కొన్ని కథలు కొన్ని డాక్యు-మెంటరీ స్టోరీస్ మరికొన్ని మనిషి 'కత'లున్నాయి. దీనికి తోడు 'కాదు సుమా` కథ కాదు సుమా! రచయిత నేపథ్యం మరియుప్రతి-స్పందను వెరశి రచయిత దృక్పథం చాలావరకు అవగతమవుతుంది.

డాక్యుమెంటరీ ఫిలిం గురించి తెలుసు. 'ముక్క ఫిలిం' అనేవాళ్ళం చిన్నప్పుడు. సమాచారశాఖ వాళ్ళ వ్యాను వస్తే పరుగెత్తుకొనిపోయి చూసేవాళ్ళం. దేవరాజు మహారాజు-గారు కొన్ని జీవనదృశ్యాల్ని ఉన్నదు-న్నట్టుగా డాక్యుమెంటరీ కథలుగా ఇందులో మనకందిస్తారు. సం-ఘటనలను యథాతథంగా దృ-శ్యాన్ని తీయడం కెమెరాకి సుళువు కావచ్చు కాని కలానికి కష్టమైన పనే. కానీ అందులో కృతకృత్యులయ్యారు రచయిత.

అలాగే మనిషి కతలన్నింటి-కి శతకపద్యానికి మకుటంలాగా ఓ ముగింపు వాక్యంవుంటుంది. 'మనిషి దేనికోసమో అన్వేషిస్తూ`



దేనికోసమో బతుకుతున్నాడు. అయితే ఈమకుటానికీ ఆ మకుటానికి తేడా ఏమిటంటే శతకమకుటం సంబోధన వరకే పరిమితమయితే ఇది కథకు ప్రతిపాదకంగా నిలుస్తుంది.

ఇందులోని కథల్లో ముఖ్యంగా తెలంగాణా నేపథ్యం ప్రస్పుటంగా వుంటుంది. తెలంగాణా యాస సంభాషణల్లో సహజసుందరంగా కన్పిస్తుంది. వెనుకబాటుతనం, అమాయకత్వం అరికాలు మండితే అగ్గివీరుడయ్యే మనస్తత్వాల్ని మహారాజు మకుటాయమానంగా చూపుతారు కథల్లో.

విజ్ఞానవేత్తగా, అధ్యయనపరుడుగా, అధ్యాపకుడుగా, కవిగా, రచయితగా ద్రష్టగా స్రష్టగా వృత్తినీ, ప్రవృత్తినీ సమంగా నిర్వహించే సవ్యసాచి దేవరాజు మహారాజు. తెంగాణా ముద్దుబిడ్డగా తెంగాణా సాహితీమతల్లికి తనవంతు కర్తవ్యాన్ని సమర్ధవంతంగా నిర్వహించిన ఈయన ధన్యుడు.

డా.దేవరాజు మహారాజు దాదాపు 150 మంది భారతీయ కవుల్ని, 50 మంది మరాఠి దళితకవుల్ని కవితాభారతి, మట్టిగుండె చప్పుళ్లు కవితా సంకలనాల ద్వారా పరిచయం చేశారు. వీటి ద్వారా భారతీయ భాషల కవిత్వాన్ని కథల్ని తెలుగులోకి అనువదించి తెలుగు కళ్లకు ఇరుగుపొరుగు దృశ్యాల్ని చూపించారు.

తెలంగాణా జనుల భాషలో కవిత కథ చెప్పి మెప్పించి కవిగా, కథకుడిగా రాణించారు. తానొక శాస్త్రవేత్తగా ఎయిడ్స్‌పై అవగాహన కోసం తొగలోపుస్తకం రాసి సామాజిక బాధ్యత నిర్వర్తించారు. చైనాకథను చిన్నారి బాలలకోసం అనువదించారీయన. హేతువాద దృకృథం గ డా. దేవరాజు మహారాజు సాహిత్య కృషి అనన్యసామాన్య మైనది, వైవిధ్యంతో కూడుకొన్నది.


వీరి కృషికి తగ్గట్టుగానే వీరికి అనేక గౌరవ సత్కారాలు లభించాయి. రాష్ట్రప్రభుత్వం ఉగాది సత్కారం, తెలుగు విశ్వవిద్యాలయ కవితా పురస్కారం, దాశరథి దంపతుల సత్కారం, తొలి ఎక్స్‌రే పురస్కారం, సురమౌళి అవార్డు, డాక్టర్ పరచుచూరి రాజారాం సాహిత్య పురస్కారం వంటి పురస్కారాల నందుకున్నారు డాక్టర్ దేవరాజుమహారాజు.

ఒక దశాబ్ది కాలంగా నేషనల్ బుక్‌ట్రస్ట్ వారికి (న్యూఢిల్లీ)సలహా సంఘ సభ్యులుగా ఉన్న వీరు, ప్రపంచ ప్రఖ్యాత కథకుల కథల్ని అనువదించారు.వ్యాస విస్తృతిని దృష్టిలోఉంచుకుని వీరి రచనలను వివరించలేకపోతున్నాను.ఒకశాస్త్రవేత్తగా, సాహితీవేత్తగా తమ రచనలను వెలువరిస్తున్న సవ్యసాచి రచయిత దేవరాజు కవి మహారాజు.


కనక మహాలక్ష్మి అమ్మవారు


కోవిడ్ వ్యాక్సిన్ తయారీ సంస్థ భారత్ బయోటెక్ ను
సందర్శించిన ప్రధాని

RNI No. TELTEL/2011/39497 NOVEMBER 2020 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication: 1st December Date of Posting: 8th December



Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001